ఈనాడు
తూర్పుగోదావరి
బుధవారం అక్టోబరు 16, 2024

నవంబరు 15న సత్యదేవుని గిరిప్రదక్షిణ

గత సమస్యలు పునరావృతం కాకుండా ప్రణాళిక


గత ఏడాది నవంబరు 27న సత్యదేవుని దర్శనానికి కిక్కిరిసిన భక్తులు (కొండపైన)

అన్నవరం, న్యూస్‌టుడే: కార్తిక పౌర్ణమి రోజు నిర్వహించే అన్నవరం సత్యదేవుని గిరి ప్రదక్షిణకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆ రోజున రత్న, సత్యగిరుల చుట్టూ సుమారు 8.4 కి.మీ మేర సాగే ప్రదక్షిణకు దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాదిమంది భక్తులు పాల్గొంటారు. దర్శనం, వ్రతాలకు తీవ్ర రద్దీ నెలకొంటుంది. ఈ ఏడాది నవంబరు 15న గిరి ప్రదక్షిణ ఉండనుంది. ఏటా ఉదయం 8 గంటలకు కొండ దిగువన తొలిపావంచాల వద్ద సత్యరథానికి పూజలు చేసి ప్రదక్షిణ ప్రారంభిస్తుంటారు. ఇదే సమయానికి భక్తులు వేలాదిగా పాల్గొంటుండటంతో నియంత్రణ, సౌకర్యాల విషయంలో ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో ఈసారి మధ్యాహ్నం 2 గంటలకు సత్యరథాన్ని ప్రారంభిస్తారు. వైదిక కార్యక్రమాలన్నీ తొలుత నిర్వహించి ఆ తర్వాత రథాన్ని ప్రారంభిస్తే ఉదయం నుంచే భక్తులు గిరిప్రదక్షిణలో ఉంటారని.. తద్వారా కొండ దిగువన, పైన ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. సింహాచలంలో ప్రస్తుతం ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు. అక్కడ కొండ దిగువన తొలిపావంచాల వద్ద మధ్యాహ్నం 2 గంటలకు అప్పన్న పుష్పరథాన్ని ప్రారంభిస్తారు. భక్తులు ఉదయం నుంచే గిరిప్రదక్షిణ చేస్తుంటారు.

● నాడు తీవ్ర అవస్థలు

అన్నవరంలో గతేడాది నవంబరు 27న గిరి ప్రదక్షిణ నిర్వహించగా రెండు లక్షల మంది హాజరయ్యారు. ఇదే సమయంలో దర్శనానికి సుమారు 1.50 లక్షల మంది రావడం. వ్రతాలు కూడా 16వేల వరకు జరగడంతో కొండపైన ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేయలేక ఇబ్బందులు ఎదురయ్యాయి. గత అనుభవాలు, ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో ఈ దఫా సమస్యలకు ఆస్కారం లేకుండా చేయాలని యోచిస్తున్నారు. ఈవో కె.రామచంద్రమోహన్ మాట్లాడుతూ "కార్తిక పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ, సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు కొండపైన, దిగువన ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సత్యరథాన్ని మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభించాలని భావిస్తున్నాం. దీంతో భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేయడానికి వీలుంటుంద'ని తెలిపారు.

నేటి నుంచి కొత్త మద్యం దుకాణాలు

లైసెన్సుల జారీతో అమ్మకాలకు ఏర్పాట్లు


బ్రాండ్ బాజా



ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, టి.నగర్, సీతానగరం: మద్యం దుకాణాల కేటాయింపులో కీలక ఘట్టం ముగియడంతో దుకాణాల ఏర్పాటులో ప్రైవేటు వ్యాపారులు హడావుడిగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాత ప్రక్రియను రద్దుచేసి కొత్త మద్యం విధానం తెరమీదికి తెచ్చింది. నికార్సయిన బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టింది. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో 413 దుకాణాలు మంజూరుచేసింది. సోమవారం నిర్వహించిన లాటరీలో వీటిని దక్కించుకున్నవారు అబ్కారీ శాఖ నుంచి ప్రొవిజనల్ లైసెన్సులు పొంది.. బుధవారం నుంచి దుకాణాలు తెరవబోతున్నారు.

చకచకా ఏర్పాట్లు

మద్యం దుకాణదారులు ప్రాథమికంగా లైసెన్సు రుసుములో 1/6 వంతు మొత్తాన్ని చెల్లించి, మిగిలిన మొత్తానికి బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంది. వారికి లైసెన్సు ఇస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి ఉమ్మడి జిల్లాలో 373 దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేశారు. రాత్రికి నూరుశాతం పూర్తిచేసి బుధవారం నుంచి వ్యాపారాలకు వెసులుబాటు కల్పిస్తున్నారు. ● కాకినాడ జిల్లాలోని మద్యం దుకాణాలకు సామర్లకోట డిపో.. కోనసీమలోని దుకాణాలకు అమలాపురంలోని డిపో నుంచి మద్యం నిల్వలు సరఫరా అవుతాయి. రాజమహేంద్రవరం పరిధిలో దుకాణాలకు రాజమహేంద్రవరం డిపో నుంచి.. నిడదవోలు, దేవరపల్లి, కొవ్వూరు పరిధిలోని దుకాణాలకు చాగల్లు డిపో నుంచి సరఫరా చేస్తారు. లైసెన్సుదారుకు కేటాయించిన ఐడీ ఆధారంగా ఏ బ్రాండ్లు కావాలో డిపోల నుంచి కొనుక్కునే వెసులుబాటు కల్పించారు.



వారే వీరు.. వీరే వారు

రాజమహేంద్రవరంలో మద్యం దుకాణాల కేటాయింపులో దరఖాస్తు దశ నుంచి దుకాణాలు దక్కించుకునేవరకు అంతా ఏకపక్షంగా సాగింది. ఈ క్రతువులో కొందరు వైకాపా నాయకులను కూడా స్థానిక నేత చేర్చుకోవడం చర్చనీయాంశంగా మారింది. అర్బన్‌కు చెందిన ఓ నాయకుడు రూ.1.40 కోట్లు పెట్టుబడిగా పెట్టి తన మాట జవదాటని వారి చేత రాజమహేంద్రవరం నగరం, రాజానగరం నియోజకవర్గాల్లో దుకాణాల కోసం దరఖాస్తు చేయించినట్లు తెలుస్తోంది. ఒక్క అర్బన్‌లోనే బినామీల పేర్లతో 42 డీడీలు జత చేసినట్లు సమాచారం. ఇతరులెవరూ దరఖాస్తు చేయకుండా అడ్డుతగిలి.. లాటరీలో అర్బన్‌లోని 28 దుకాణాల్లో ఏకంగా 11 చేజిక్కించుకున్నారు. మరో నాలుగు దుకాణాలు రాజానగరం నియోజకవర్గంలో గత సర్కారులో కీలకమైన ఓ నాయకుడికి ఇచ్చినట్లు తెలుస్తోంది. మిగిలిన దుకాణాలు బయట వ్యక్తులు లాటరీ విధానంలో దక్కించుకొన్నారు. వీటిపైనా కన్ను పడడంతో పిలిపించి సమావేశం ఏర్పాటుచేశారు. సిండికేటు కట్టాలని, లేదంటే ఇక్కడ వ్యాపారాలు చేయలేరని స్పష్టంచేశారు. కాదు లేదు అంటే లాభాల్లో 25 శాతం వాటా ఇచ్చేయాలని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. తమ పార్టీలోని రాజానగరానికి చెందిన నాయకుడికి నగరంలో దుకాణాలు కేటాయించడం ఏమిటని ఓ వైకాపా నేత ఆగ్రహం వ్యక్తంచేస్తూనే.. తనకూ రెండు దుకాణాలు కేటాయించాలని బేరమాడటం చర్చనీయాంశమైంది. గ్రామీణ మండలానికి చెందిన నేత కూడా నగరంలో రెండు దుకాణాను బినామీల పేర్లతో దక్కించుకున్నారనే ప్రచారం సాగుతోంది.

వైకాపా నాయకుడి హవా..

మద్యం వ్యాపారంతో పాటు రాజకీయాల్లో ఉంటూ వైకాపాలో పలు పదవులు చేపట్టిన సీతానగరం మండలానికి చెందిన ఓ నాయకుడికి తాజా లాటరీలో ఏడు మద్యం దుకాణాలు దక్కాయి. బంధువులు, స్నేహితులతో కలిసి రూ.2.2 కోట్లతో 101 చోట్ల దరఖాస్తులు చేశారు. రంపచోడవరం, కోరుకొండ, గోకవరం, రాజానగరం, బిక్కవోలు తదితర ప్రాంతాల్లో ఏడు దుకాణాలు దక్కడంతో ఖుషీగా ఉన్నారు.

ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు


కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మంగళవారంతో గడువు ముగిసింది. సెప్టెంబరు 3 వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. విచారణ పూర్తి చేసి, 24న ముసాయిదా జాబితా ప్రచురించారు. అభ్యంతరాల స్వీకరణతో పాటు ఈనెల 15 వరకు మిగిలిపోయిన అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటివరకు వచ్చినవాటిపై ఈనెల 30లోగా విచారణ చేసి, నవంబరు 6న తుది జాబితా ప్రకటిస్తారు. గతనెల 24 నుంచి ఈనెల 15 వరకు కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి జిల్లాల్లో ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తుల వివరాలు మంగళవారం రాత్రికి కాకినాడ కలెక్టరేట్‌కు చేరలేదు. బుధవారం కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

జిల్లాకో సారథి..

అభివృద్ధికి వారధి

- ❖ అంబేడ్కర్ కోనసీమకు ఇన్‌ఛార్జిగా అచ్చెన్నాయుడు
- ❖ కాకినాడ- నారాయణ; తూర్పునకు రామానాయుడు


పొంగూరు నారాయణ


కింజరాపు అచ్చెన్నాయుడు


డాక్టర్ నిమ్మల రామానాయుడు

ఈనాడు, కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరిలోని మూడు జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌ఛార్జి మంత్రులను నియమించింది. ఆయా జిల్లాల్లో అమలయ్యే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించి, పర్యవేక్షించే బాధ్యత అప్పగించింది. కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జిగా పురపాలక- పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణను నియమించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ ఇన్‌ఛార్జిగా వ్యవసాయ- సహకార- మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.. తూర్పుగోదావరి జిల్లాకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును నియమించారు.

ఆశలన్నీ అమాత్యులపైనే..

గత వైకాపా పాలనలో వ్యవస్థలు గతితప్పాయి.. అనేక కీలక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. వీటిని గాడినపెట్టే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది. పాలన కుదుటపడ్డాక ఇన్‌ఛార్జి మంత్రులను నియమించింది. వ్యవసాయ ఆధారిత జిల్లాలు కావడం.. రెండు నగరాలు, కీలక పట్టణాలు ఉండడంతో మంత్రులు పరిస్థితి చక్కదిద్ది, ప్రగతిని పట్టాలెక్కిస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ❖ డెల్టాలకు ఆధారమైన కాటన్ బ్యారేజీని బలోపేతం చేసి ఆ పరిధిలోని సాగునీటి, మురుగు పారుదల వ్యవస్థలను ఆధునికీకరించాలి. ఈ ప్రక్రియ సమర్థంగా పూర్తయితే ముంపు సమస్యకు, శివారు సాగునీటి కష్టాలకు పరిష్కారం దొరికినట్లే.. ❖ ఉమ్మడి జిల్లాతోపాటు విశాఖ అవసరాలు తీర్చేందుకు నిర్దేశించిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ కొలిక్కి వస్తే సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు నీళ్లు అందుబాటులోకి వస్తాయి. ❖ ఏటా విపత్తులు, వరదలతో ఎదురయ్యే నష్టాన్ని తగ్గించే దిశగా చర్యలకు ఉపక్రమించాలి. గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో కోత నివారణ చర్యలు అవసరం. ❖ ధాన్యాగారంగా పేరున్నప్పటికీ రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సాగులో ఉన్నది ఎక్కువగా కౌలు రైతులే.. విపత్తులతో ఏటా నష్టపోతున్నవారికి ఊతమివ్వాలి. ధాన్యం కొనుగోలులో దళారీల జోక్యం కట్టడి చేసి, మద్దతు ధర సమర్థంగా అందించాలి. ❖ రూ.వెయ్యి కోట్లతో తలపెట్టిన కాకినాడ ఆకర్షణీయ నగరం పనులు గత ప్రభుత్వ నిర్వాకంతో గతితప్పాయి. గాడిన పెట్టాలి. విలీన గ్రామాల సమస్యకు పరిష్కారం చూపాలి. నగర పాలక సంస్థ ఎన్నికలకు చొరవచూపాల్సి ఉంది.

సమన్వయంతో ప్రగతికి కృషి

వ్యవసాయ ఆధారిత అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌ఛార్జిగా బాధ్యత చేపట్టడం ఆనందంగా ఉంది. వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యకారుల సమస్యలకు ప్రాధాన్యం ఇస్తాము. సహకార రంగం బలోపేతంపైనా దృష్టిసారిస్తా. భాజపా- జనసేన- తెదేపా శ్రేణుల సమన్వయంతో జిల్లాలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతాం. సంక్షేమ కార్యక్రమాల అమలు సమర్థంగా జరిగేలా చూస్తాం.

-కింజరాపు అచ్చెన్నాయుడు, వ్యవసాయ-సహకార-మత్స్యశాఖ మంత్రి

గండాల దారి.. గుంతల్లో సవారీ


సామర్లకోట రైల్వే వంతెన వద్ద రహదారి దుస్థితి

గత వైకాపా ప్రభుత్వం రహదారుల నిర్వహణ, మరమ్మతులు పూర్తిగా విస్మరించింది. చాలాచోట్ల ప్రధాన మార్గాలు సైతం గుంతలు పడి, కంకర రాళ్లు తేలి అధ్వానంగా మారాయి. దీంతో పలువురు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి. కాకినాడ- సామర్లకోట రహదారే ఇందుకు నిదర్శనం. 15 కి.మీ. ఈ మార్గం పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన నగరాలైన రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలను కలిపే మార్గాల్లో ఇది ఒకటి. వర్షం పడితే గుంతల్లో నీరు చేరి లోతు తెలియక ప్రయాణం నరకంగా మారింది. ఇటీవల 60 ఏళ్లు దాటిన వృద్ధ దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తూ మాధవపట్నం కాకినాడ బైపాస్ రైల్వే వంతెన దాటిన తర్వాత గుంతలో పడ్డారు. వృద్ధురాలు కిందపడి మృత్యువాతపడ్డారు. యంత్రాంగం స్పందించి ఈ రహదారికి తక్షణ మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. - ఈనాడు, కాకినాడ

గోకవరంలో అత్యధిక వర్షపాతం

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో(మంగళవారం ఉదయం 8 గంటల వరకు) గోకవరం మండలంలో అత్యధికంగా 21.8 మి.మీ వర్షపాతం నమోదుకాగా అత్యల్పంగా కొవ్వూరు మండలంలో 3.4 మి.మీగా నమోదైంది. మండలాల వారీగా పెరవలిలో 20.6, ఉండ్రాజవరంలో 15.2, సీతానగరం 8.8, బిక్కవోలు 8.6, దేవరపల్లి 8.4, తాళ్లపూడి 8.2, నల్లజర్ల 7.4, రాజానగరం 7.2, అనపర్తి 7.2, కడియం 7.2, రాజమహేంద్రవరం గ్రామీణం 6.8, రంగంపేట 6.4, చాగల్లు 6.2, కోరుకొండ 5.2, నిడదవోలు 4.8, గోపాలపురం 4.6, రాజమహేంద్రవరం అర్బన్ 4.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

14 రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): టెండర్ల విధానంలో కేటాయించిన 14 ఓపెన్ రీచ్‌ల్లో బుధవారం నుంచి ఇసుక తవ్వకాలు జరిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓపెన్ రీచ్‌ల్లో సంబంధిత ఎల్ వన్ అభ్యర్థులు రోజుకు కనీసం వెయ్యి మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు జరపాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి యంత్రాలు వినియోగించరాదన్నారు. రీచ్‌ల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం, తవ్వకాలు, రవాణా, దస్త్రాల నిర్వహణ తదితర విషయాల్లో సూచనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఎన్జీటీ మార్గదర్శకాల మేరకు బోట్స్‌మెన్ సొసైటీలు డీసిల్టేషన్ ప్రక్రియ చేపట్టేందుకు అనుమతులు జారీ చేశామని, దానికి అనుగుణంగా రీచ్‌లు ప్రారంభం కానున్నాయని తెలిపారు.

మరింత సరళీకృతంగా...

సులభతరంగా వినియోగదారులకు ఇసుక అందించేందుకు ఆఫ్‌లైన్ వాక్-ఇన్ బుకింగ్‌ను బుధవారం నుంచి అమలులోకి తీసుకొస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రీచ్‌లు, డీసిల్టేషన్ పాయింట్లు, స్టాక్ యార్డ్‌లతో సహా అన్ని ఇసుక సరఫరా పాయింట్ల వద్ద 24 గంటల బుకింగ్, డిస్పాచ్‌ను సులభతరం చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ బుకింగ్‌లో ఇసుక డెలివరీ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య పూర్తవుతుందని, ఆఫ్‌లైన్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు లోడింగ్ జరుగుతుందని తెలిపారు.

కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షణ

ఇసుక రీచ్‌ల్లో కార్యకలాపాలను జిల్లా, డివిజన్ స్థాయి కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి వాహనానికి జియోట్యాగింగ్ సిస్టం ఏర్పాటు చేశామన్నారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో జేసీ చిన్నరాముడు, అదనపు ఎస్పీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం

-కూటమి నేతలు-

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: త్వరలో జరగబోయే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కూటమి నాయకులంతా కృషిచేద్దామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం మంగళవారం రాజమహేంద్రవరంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలో లేనప్పుడే పట్టభద్రుల ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టగానే మెగా డీఎస్సీ ప్రకటించిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ముందు.. నమోదు ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అంతా కలిసి కట్టుగా పనిచేస్తే వైకాపా పోటీకి వచ్చే అవకాశం లేదన్నారు. అభ్యర్థి ఎవరైనా కూటమి గెలుపు కోసం పని చేయాలన్నారు. రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పాలన అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం యువతను

వైకాపా యువతను మోసం చేసింది..

నమ్మించి మోసం చేసిందన్నారు. కాకినాడ, ఏలూరు, రాజమహేంద్రవరంలో ఎక్కువ మంది పట్టభద్ర ఓటర్లుంటారు కనుక మరింత దృష్టి సారించాల్సి ఉందన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీలు హరిప్రసాద్, చిరంజీవిరావు, మాజీ మంత్రులు సుజన కృష్ణ రంగారావు, జవహర్, పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, భాజపా జనరల్ సెక్రటరీ కాశీ విశ్వనాథ్ తదితరులు మాట్లాడారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, బూరుగుపల్లి శేషారావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో మంత్రులు నిమ్మల, దుర్గేష్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తదితరులు

గోరంట్ల అసంతృప్తి


సమావేశంలో పాల్గొన్న గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గోరంట్లను మాట్లాడాలని కోరగా.. సమావేశం ఇంత త్వరగా ఎందుకు ఏర్పాటు చేశారని ఆయన ప్రశ్నించారు. తాను ఏమీ మాట్లాడనని అంటూ కూర్చుండిపోయారు. ఆ తర్వాత కొద్ది నిమిషాలకే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

తల్లిదండ్రులకు కొత్త వాహనం చూపిద్దామని..


గణేష్ కుమార్ (పాతచిత్రం)

ఉపాధ్యాయుడిని వెంటాడిన మృత్యువు

గోపాలపురం, న్యూస్‌టుడే: ఎంతో ఇష్టమైన ద్విచక్రవాహనాన్ని కొనుగోలు చేశారు ఆ ఉపాధ్యాయుడు. ఆ ఆనందాన్ని తల్లిదండ్రులతో పంచుకుందామని, వారికి చూపిద్దామని బయలుదేరారు. ఇంతలో మృత్యువు లారీ రూపంలో చిదిమేసింది. ఈ విషాద సంఘటన గోపాలపురం శివారు జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. బంధువులు, పోలీసుల వివరాల ప్రకారం..ఏలూరు జిల్లా బొర్రంపాలెం గ్రామానికి చెందిన కె.గణేష్‌కుమార్(42) చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. భార్య, కుమార్తెతో కలిసి నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో నివాసముంటున్నారు. సోమవారం గణేష్‌కుమార్ నూతన ద్విచక్రవాహనం కొనుగోలు చేశారు. తల్లిదండ్రులకు చూపిద్దామని మంగళవారం స్వగ్రామం బయలుదేరి వెళ్లారు. గోపాలపురం శివారులో లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన గణేష్‌కుమార్‌ను స్థానికులు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమహేంద్రవరం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గణేష్‌కుమార్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు.


ప్రమాద దృశ్యం

వల్మీకంలో శ్రీనివాసుడిగా ద్వారకాధీశుడి దర్శనం


చంద్రప్రభ వాహనంపై శ్రీవారి విహారం

ద్వారకాతిరుమల: తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ద్వారకాధీశుడు శ్రీదేవి, భూదేవి సమేతంగా చంద్రప్రభ వాహనంపై విహరించారు. రోజుకో విశేష అలంకారంలో భక్తులను కనువిందు చేస్తున్న స్వామి వారు మంగళవారం వల్మీకంలో శ్రీనివాసుడి అలంకారంలో దర్శనమిచ్చారు. కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఏడు గంటలకు హనుమద్వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం. రాత్రి ఏడు గంటలకు ఎదుర్కోలు ఉత్సవం. 8.30కు వెండి శేషవాహనంపై గ్రామోత్సవం జరుగుతాయి.

పురందేశ్వరి వినతిపై కేంద్రం పరిశీలన

దేవీచౌక్(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం నగరాన్ని వై కేటగిరిలో చేర్చాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి లేఖపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ప్రస్తుతం జెడ్ కేటగిరిలో ఉన్న నగరాన్ని వైలోకి మార్చాలని ఆగస్టు నెలలో ఎంపీ లేఖ రాశారు. దీనిపై కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి స్పందిస్తూ.. లేఖను పరిశీలించామని, దీనికి సంబంధించిన పత్రాలు కూడా అందాయని, ఈ అంశం డిపార్ట్‌మెంట్ పరిశీలనలో ఉందని బదులివ్వడంపై పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. నగరాన్ని వై కేటగిరీలో చేర్చడం వల్ల రైల్వే, ఎల్ఐసీ వంటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం లభిస్తున్న 10 శాతం హెచ్ఆర్ఏ 20 శాతానికి పెరుగుతుందన్నారు. నగరంలో అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు వస్తాయని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో దీనికి ఆమోదం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీసీ వసతి గృహాల్లో డిజిటల్ బోధన

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగుకు చర్యలు


న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం)

జిల్లాలోని వెనుకబడిన తరగతుల(బీసీ) సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం డిజిటల్ రిసోర్సు సెంటర్లు ఏర్పాటు చేయనుంది. దివంగత ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ పేరిట ఏర్పాటు చేసే ఈ సెంటర్ల కోసం 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులను పరిగణనలోకి తీసుకుని సొంత భవనాలున్న ప్రీమెట్రిక్ హాస్టళ్లను ఎంపిక చేయాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

తొలివిడతలో..

తొలివిడతలో జిల్లాలోని రాజమహేంద్రవరం డివిజన్‌లో మూడు, కొవ్వూరు డివిజన్‌లో ఒక వసతి గృహాన్ని అధికారులు ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించారు. ప్రీమెట్రిక్ హాస్టళ్లలో సొంత భవనాలు ఉన్న వాటిలో నాలుగు హాస్టళ్లను డిజిటల్ రిసోర్సు సెంటర్ల ఏర్పాటుకు ఎంపిక చేసినట్లు బీసీ సంక్షేమ అధికారి శశాంక తెలిపారు. వీటిలో బీసీ బాలికలు, బాలుర వసతి గృహాలు రెండేసి చొప్పున ఉన్నాయి.

జిల్లాలో ఇలా...

బీసీ సంక్షేమ వసతిగృహాలు	: 23
మొత్తం విద్యార్థులు	: 1,733
పాఠశాల విద్యార్థులుండే హాస్టళ్లు	: 10
రిసోర్సు సెంటర్ల ఏర్పాటుకు ఎంపిక చేసినవి	: 04
వీటిలో ప్రస్తుతం ఉన్న విద్యార్థులు	: 402

● ఎక్కడెక్కడంటే..

సెంటర్ల ఏర్పాటుకు తొలి విడతలో ఎంపిక చేసిన నాలుగు ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో రాజమహేంద్రవరం వై.జంక్షన్ వద్ద ఉన్న బీసీ బాలుర, కోటిపల్లి బస్టాండ్ వద్ద ఉన్న ఇంటిగ్రేటెడ్ బాలికల, కడియంలోని బాలుర, నిడదవోలులోని బాలికల వసతి గృహాలున్నాయి. ప్రస్తుతం వీటిలో 402 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. నవంబరు 14 బాలల దినోత్సవం రోజున ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు.

● ట్యూటర్ల ద్వారా సందేహాల నివృత్తి..

వసతి గృహంలో ఒక గదిని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు. అందులో డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డు, సమాచారాన్ని పెన్‌డ్రైవ్ ద్వారా అందిస్తారు. పాఠశాల ముగిసిన తర్వాత వసతి గృహాలకు చేరుకున్న విద్యార్థులకు సబ్జెక్టుల్లో బోధనతోపాటు సందేహాల నివృత్తికి ట్యూటర్లను నియమించనున్నారు. తద్వారా పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అధికారులు చెబుతున్నారు.

220 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు

గోకవరం: జిల్లావ్యాప్తంగా 220 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు తెలిపారు. గోకవరం గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ పంట నమోదుకు సంబంధించి జాబితాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 367 రైతు సేవాకేంద్రాలుండగా 220 చోట్ల ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సేకరించాల్సిన ధాన్యానికి అనుగుణంగా కేంద్రాలను ఏ, బీ, సీ కేటగిరిలలో విభజిస్తామన్నారు. తంటికొండ గ్రామానికి చెందిన రైతు వినతి మేరకు త్వరలోనే వీఏఏను నియమిస్తామన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు

మసీదుసెంటర్ (కాకినాడ): ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పలు క్రీడల్లో ఎంపికలు నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా కార్యదర్శి లంక జార్జి మంగళవారం తెలిపారు. వాలీబాల్ అండర్-17 బాలురు, సాఫ్ట్ టెన్నిస్ అండర్-14, 17 బాలబాలికలకు, మార్షల్ ఆర్ట్స్ అండర్-14, 17 బాల బాలికల ఎంపికలు జరిగాయన్నారు. సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. కాకినాడ జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వి.రవిరాజు, నూకరాజు, కోశాధికారి రవి సుందర్ కౌర్, ఎస్‌జీఎఫ్ అసిస్టెంట్ కార్యదర్శులు సునీల్, కె.పరశురాం, పీడీలు తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఉద్యోగుల కృషితో బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం

దేవీచౌక్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ఉద్యోగులు సహకరించాలని జిల్లా ప్రిన్సిపల్ జీఎం పలివెల రాజు కోరారు. సంస్థ పూర్వవైభవానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం సంచార్ భవన్‌లో బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఏఐబీడీపీఏ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం జరిగింది. సంస్థ ప్రస్తుత పరిస్థితి, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మూడో వేతన సవరణ వెంటనే విడుదల చేయాలని, పెన్షన్ రివిజన్ జరగాలని, విశ్రాంత ఉద్యోగులకు సీజీహెచ్ఎస్ సౌకర్యం మెరుగుపరచాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.రమాదేవి, ఏఐబీడీపీఏ రాష్ట్ర కార్యదర్శి కేవీసీ బోస్, పి.సతీష్‌కుమార్, ఎన్ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జీఎం రాజు

'వైకాపా హయాంలో రూ.వేల కోట్ల దోపిడీ'

దేవీచౌక్(రాజమహేంద్రవరం): వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.వేల కోట్లు దోచుకుని ప్రజల జీవన ప్రమాణాలు దిగజార్చారని కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకుడు కె.శివాజీ ఆరోపించారు. రాజమహేంద్రవరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శివాజీ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనూ మద్యం, ఇసుక అక్రమాలు జరుగుతున్నాయన్నారు. అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ నెలాఖరునాటికి వివిధ విభాగాల కమిటీలను నియమించడంతోపాటు సభ్యత్వ నమోదు చేపడతామన్నారు. కొండగుంటూరులో కొండలు తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, మార్టిన్ లూథర్, మోతా శారద, బెజవాడ రంగారావు, అబ్దుల్లా షరీఫ్, డాక్టర్ వడయార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివాజీ

24, 25 తేదీల్లో అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

శ్యామలాసెంటర్(రాజమహేంద్రవరం): జిల్లా స్కూల్ గేమ్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24, 25న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో అండర్-14, 17 అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి స్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ జట్టు ఎంపిక 17న: ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరగాల్సిన అండర్-14 బాల, బాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపికలు ఈనెల 17కు వాయిదా పడ్డాయన్నారు.

టెట్‌కు 429 మంది హాజరు

శ్యామలాసెంటర్(రాజమహేంద్రవరం): టెట్ మంగళవారం ప్రశాంతంగా కొనసాగింది. రాజమహేంద్రవరంలోని లూథర్‌గిరి ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఉదయం జరిగిన మ్యాథ్స్ అండ్ సైన్స్ పరీక్షకు 240 మందికి గాను 214 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 240 మందికి గాను 215 మంది హాజరయ్యారని డీఎస్ఈఓ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైద్య కళాశాలకు నిధులొస్తున్నాయ్..

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థుల వెతలకు కాస్త ఉపశమనం లభించనుంది. భవన నిర్మాణాలు, పరికరాలు సమకూర్చే నిమిత్తం నిధుల మంజూరు, పరిపాలన అనుమతులు ఇస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో కాస్తంత చేయూత అందనుంది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(ఏపీ, విజయవాడ)కు ఆర్థిక (ఎఫ్ఎంయూ- హెచ్ఎం అండ్ ఎఫ్‌డబ్ల్యూ) శాఖ జారీ చేసిన బడ్జెట్ విడుదల ఆర్డర్(బీఆర్వో) ప్రకారం రాజమహేంద్రవరంతోపాటు రాష్ట్రంలో మరో రెండు వైద్య కళాశాలలకు మొత్తం రూ.241.81 కోట్ల నిధులకు పరిపాలన అనుమతిని మంజూరు చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

అతివకు అభయం

భద్రతకు మహిళా రక్షక్

న్యూస్‌టుడే, దానవాయిపేట(రాజమహేంద్రవరం)

● రాజమహేంద్రవరం, రావులపాలెం ప్రాంతానికి చెందిన నలుగురు బాలికలు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయంతో ఇంట్లో చెప్పకుండా విహార యాత్రకు బయలుదేరారు. అర్ధరాత్రి రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మహిళ రక్షక్ బృందం వీరిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించింది.

● రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో సోమవారం రాత్రి ఒంటరిగా ఉన్న మహిళను ఓ ఆకతాయి అల్లరి చేస్తుండగా ఆమె 112 కాల్ చేశారు. మహిళ రక్షక్ బృందం అక్కడకు చేరుకుని రక్షణ కల్పించడంతో పాటు సదరు వ్యక్తిని రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో అప్పగించింది.

జిల్లాలో మహిళల రక్షణకు పోలీసుశాఖ చర్యలు చేపడుతోంది. ఎస్పీ నరసింహకిషోర్ ఆధ్వర్యంలో మహిళ రక్షక్ పేరుతో 15 మందితో కూడిన బృందం నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తోంది. రెండు వాహనాల్లో రాత్రి తొమ్మిది నుంచి ఉదయం ఆరు గంటల వరకూ ఇవి రాజమహేంద్రవరం నగర, గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ మహిళలకు భద్రత కల్పిస్తున్నారు.

ఈ నంబర్లకు చేస్తే చాలు..

పగలు, రాత్రి తేడా లేదు.. ఏ తరహా ఆపద ఎదురైనా మహిళలు, బాలికలు, డయల్ 112, 94932 06006 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇస్తే పోలీసులు సత్వరం అప్రమత్తమై ఆదుకుంటారు. ప్రస్తుతం నగరం, గ్రామీణంలో ఈ వాహనాలు మూడు షిఫ్టులుగా మహిళ హెచ్‌సీ, పీసీలు బృందంగా సంచరిస్తున్నారు. సిబ్బందికి వాకీటాకీలు ఉండడంతో ఎప్పటికప్పుడు జిల్లా పోలీసు కేంద్రంలోని కంట్రోల్ రూమ్‌తో అనుసంధానమై ఉంటారు. సమాచార మార్పిడి ఎప్పటికప్పుడు జరుగుతుంది. ఏ ఘటనైనా సెల్‌ఫోనులో చిత్రీకరించడంతో భద్రత విషయంలో మహిళలు ఏ మాత్రం సందేహపడాల్సిన అవసరం లేదు. ఏ తరహా ఆపదలో ఉన్న వారైనా సరే మహిళ రక్షక్‌ను ఆశ్రయిస్తే వారికి రక్షణగా నిలుస్తామని పోలీసులు చెబుతున్నారు.


సేవలకు సిద్ధంగా బృందం

● వనితలు తమకు ఎటువంటి సమస్య ఎదురైనా 112కు డయల్ చేస్తే చాలు మహిళా రక్షక్ వాహనం సంఘటన స్థలానికి చేరుకుంటుంది. ఆపదలో ఉన్న మహిళను రక్షించి వారిని సురక్షితంగా ఇంటికి చేరుస్తుంది. పది రోజులు కిందట ఏర్పాటు చేసిన ఈ బృందం మూడు ఘటనలో ఆరుగురు బాలికలు, ఓ మహిళకు రక్షణగా నిలిచింది.

మేం ఉన్నది మీ రక్షణకే..

పోలీసులు ఉన్నది ప్రజల రక్షణ కోసమే. అందులోనూ చిన్నారులు, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇందులో భాగంగానే జిల్లాలో మహిళ రక్షక్ వాహనాలు అందుబాటులోకి తెచ్చాం. ఆపదలో ఉన్న మహిళలు ఎవరైనా.. ఏ సమయంలోనైనా ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఫోన్ చేసి పోలీసు రక్షణ పొందవచ్చు.

- డి.నరసింహకిషోర్, జిల్లా ఎస్పీ

నన్నయలో పీజీ కోర్సులకు 17న తక్షణ ప్రవేశాలు

నన్నయ విశ్వవిద్యాలయం (రాజానగరం), న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయం 2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఏ, ఎంకామ్, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ కోర్సుల్లోని భర్తీ చేయని సీట్లకు ఈనెల 17వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ పీజీసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయ ప్రధాన ప్రాంగణం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలో సంబంధిత సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయంలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారని చెప్పారు. అభ్యర్థులు 17వ తేదీ ఉదయం 9.30 నుంచి 11 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తారన్నారు. సీట్లు, ఫీజు వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు.

నేడు గోకవరం మీదుగా వెళ్లే వాహనాల దారి మళ్లింపు

గోకవరం: గోకవరం దేవీచౌక్ దుర్గాదేవి అమ్మవారి భారీ ఊరేగింపుతో పాటు వీరభద్రుని గద్దెలో దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపులు బుధవారం సాయంత్రం నుంచి నిర్వహించనున్నారు. పెద్దఎత్తున సాగే ఈ ఊరేగింపులను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరానుండడంతో గోకవరంలో ట్రాఫిక్ నిలిచిపోకుండా సాయంత్రం మూడు గంటల నుంచి వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం రాకపోకలు సాగించే వాహనాలు గోకవరం రాకుండా వీర్లంకపల్లి, పెంటపల్లి, రంపయర్రంపాలెం, గంగంపాలెం, సూదికొండ చెక్‌పోస్టు, కొత్తపల్లి, రామన్నపాలెం మీదుగా రాకపోకలు సాగించాలన్నారు. జగ్గంపేట వైపు నుంచి వచ్చే వాహనాలు గోకవరం రాకుండా ఆయా రూట్లలో వెళ్లాలన్నారు. అదేవిధంగా రాజమహేంద్రవరం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను లారీ యూనియన్ కార్యాలయం వద్ద, రంపచోడవరం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను తంటికొండ జంక్షన్ ఆర్చి వద్ద, జగ్గంపేట వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను డ్రైవర్స్ కాలనీ వద్ద నిలిపివేస్తారన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): డీఎస్సీకు సిద్ధమవుతున్న జిల్లాకు చెందిన షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు చెందిన అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.సందీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్‌జీటీలకు ఇంటర్మీడియట్‌తోపాటు డైట్‌సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్స్‌కు డిగ్రీ, బీఈడీ, టెట్ అర్హతలున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.2.50 లక్షలలోపు ఉండాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని, ఎంపికైన వారికి శిక్షణతోపాటు భోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 27న పరీక్ష జరుగుతుందని, 30న జిల్లాల వారీగా ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడించనున్నట్లు తెలిపారు. నవంబరు 6వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

నాయీ బ్రాహ్మణులకు రూ.800 కోట్లు కేటాయించాలి

కాకినాడ కలెక్టరేట్: ఉమ్మడి జిల్లాలోని నాయీబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు మంగళవారం కాకినాడలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారికి అవసరమైన నిధులు, సదుపాయాలు, అవకాశాలపై చర్చించారు. ఆ సంఘాల ప్రతినిధులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి రూ.800కోట్లు కేటాయించాలని కోరారు. గ్రేడ్-1 దేవాలయాలకు ఛైర్మన్లుగా, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు, పట్టణ స్థానిక సంస్థల్లో కో-ఆప్షన్ సభ్యులుగా నియమించాలని కోరారు. స్వయం ప్రతిపత్తి ఉన్న దేవాలయాల్లో డైరెక్టర్ పదవులు ఇవ్వాలని, వాయిద్య కళాకారులకు 50 ఏళ్లకే పింఛను సదుపాయం కల్పించాలని కోరారు. సంఘాల ప్రతినిధులు సుందరపల్లి గోపాలకృష్ణ, దాస్యం ప్రసాద్, చొప్పెల్ల శ్రీనివాస్, మానుకొండ దుర్గాప్రసాద్, ఎం.నాగసత్యనారాయణ, కె.సూరిబాబు, ర్యాలి లోవరాజు, సీహెచ్.శివప్రసాద్, వేపాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఈడీ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యల పరిష్కారానికి వినతి

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: ఉపాధ్యాయుల పీఎఫ్ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా పరిషత్తు సీఈవోకు విన్నవించింది. మంగళవారం జడ్పీ కార్యాలయంలో సీఈవో వీవీఎస్ లక్ష్మణరావును ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్ తదితరులు కలిశారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి పీఎఫ్ స్లిప్పులను అందుబాటులో ఉంచాలని కోరారు. 2022 జనవరి, ఫిబ్రవరిల పీఎఫ్ సబ్‌స్క్రిప్షన్లను వారి ఖాతాలో నమోదు చేయాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుల పీఎఫ్ చెల్లించిన తర్వాత జమైన 2022 జనవరి, ఫిబ్రవరిల పీఎఫ్, డీఏల బకాయిలు తిరిగి చెల్లించాలన్నారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సీఈవోకు ఇచ్చారు. నాయకులు యు.శ్రీను, పి.సుబ్బరాజు, టి.సంపత్‌కుమార్, పోతు రామకృష్ణ, కేవీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


సీఈవో లక్ష్మణరావుకు వినతిపత్రం అందించిన ఎస్టీయూ నాయకులు

ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్

గాంధీనగర్: సహకార బ్యాంకు సీఈవో ఇచ్చిన ఉత్తర్వులు తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేదంటే సమ్మెకు దిగుతామని ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ అనుబంధ) నాయకులు హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా సంఘ సమావేశం కాకినాడ పరిధిలోని సహకార రంగ ఉద్యోగుల భవనంలో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకటరామయ్య, రాష్ట్ర కోశాధికారి పి.సత్యనారాయణలు హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో ఈనెల 7న ఇచ్చిన ఉత్తర్వులో 2019 తర్వాత సహకార ఉద్యోగులుగా నియమించిన వారిని, 60 ఏళ్లు పూర్తయిన వారిని తొలగించాలని పేర్కొన్నారన్నారు. కోర్టు అనుమతిలేని వారు పొందిన జీతాలు తిరిగి చెల్లించాలన్నారు. వాటిని ఉపసంహరించుకోవాలన్నారు. బుధవారం నుంచి నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావాలన్నారు. ఆన్‌లైన్, జూమ్, దూరదృశ్య సమావేశాలను బహిష్కరిస్తున్నామన్నారు. 21న కాకినాడ డీసీసీబీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. సీఐటీయూ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం మాట్లాడుతూ నిబంధనల మేరకే 2019లో నియామకాలు జరిగాయన్నారు. అయిదేళ్ల సర్వీసు తర్వాత వారిని తొలగించడం చట్ట వ్యతిరేకమన్నారు. సహకార ఉద్యోగులు చేసే పోరాటాలకు సీఐటీయూ మద్దతు ఉంటుందన్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు కె.ఆదినారాయణమూర్తి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. సీఐటీయూ కోనసీమ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, తూగో.జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి, బలరాం

నర్సరీ రంగానికి పుల్లా చంటియ్య ఆదర్శం



కడియం: శ్రీసత్యదేవా నర్సరీ అధినేత, కడియపులంక సర్‌ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ (చంటియ్య) సోమవారం అర్ధరాత్రి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయనకు భార్య మహాలక్ష్మి, కుమారుడు పుల్లా పెద్ద సత్యనారాయణ, కుమార్తెలు పిండి కనక దుర్గ, సంగిసెట్టి వరలక్ష్మి ఉన్నారు. నర్సరీ రంగానికి ఆయనొక దిక్సూచి అని రైతులు కొనియాడారు. చంటియ్య మృతికి నివాళిగా మంగళవారం నర్సరీలలావాదేవీలకు సెలవు ప్రకటించారు. నర్సరీ రంగంలో గౌరవ డాక్టరేట్ పొందారని, ఎన్నో పురస్కారాలు ఆయన్ను వరించాయని రైతులు తెలిపారు. మృతి పట్ల నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్, గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఐఎన్ఏ మాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం, పల్ల వెంకన్న ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పల్ల సత్తిబాబు, మార్గాని సత్యనారాయణ సోదరులు.. ఇతర ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు సంతాపం ప్రకటించారు.

250 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ

రాజమహేంద్రవరం నేరవార్తలు: పండగ సెలవుల నేపథ్యంలో కుటుంబసమేతంగా ఊరెళ్లితే తిరిగి వచ్చేసరికి చోరులు ఇంట్లో చొరబడి 250 గ్రాముల బంగారు అభరణాలు పట్టుకుపోయారు. చోరీకి పాల్పడిన ఆగంతకులు పోలీసులకు చిక్కకుండా సీసీ కెమెరాల డిజిటల్ వీడియో రికార్డర్(డీవీఆర్)ను కూడా పట్టుకుపోయారు. ఈ ఘటన రాజమహేంద్రవరం ప్రకాశంనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఎస్పీ కె.రమేష్‌బాబు వివరాల మేరకు.. నగరంలోని శ్యామలానగర్‌లో గాదం శ్రీనివాస్ పిల్లలకు దసరా సెలవులు ఇవ్వడంతో హైదరాబాద్‌లో బంధువుల ఇంటికి గత నెల 29న కుటుంబ సమేతంగా వెళ్లారు. తిరిగి ఈ నెల 14న వచ్చేసరికి ఇంటి తాళం తీసిఉంది. ఇంటోకి వెళ్లిచూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. సీసీ కెమెరాల పుటేజీ స్టోరేజ్ అయ్యే డీవీఆర్ లేదు. దీంతో బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీతోపాటు సీఐ బాజీలాల్ పరిశీలించారు. ఫిర్యాదు మేరకు సుమారు 250 గ్రాముల వరకు బంగారు ఆభరణాలు దుండగులు పట్టుకుపోయినట్లు మంగళవారం కేసు నమోదు చేశారు.


ఇంట్లో చెల్లాచెదురుగా వస్తువులు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

చెట్టు కొమ్మ పడి మహిళ మృతి

దేవరపల్లి, న్యూస్‌టుడే: మామిడి చెట్టు మొదలు మొద్దు పడి మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం దేవరపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని అచ్చియ్యపాలెం గ్రామానికి చెందిన పీతల సుబ్బాయమ్మ(48) ఎప్పటిలాగే సాయంత్రం ఇంటి ఆవరణలో తుడుస్తున్నారు. ఇంటి వెనుక ఉన్న వాళ్లు సరిహద్దులోని మామిడి చెట్టును తొలగిస్తున్నారు. ఆ చెట్టు విరిగి నేలపై పడే సమయానికి ఆమె అక్కడే ఉండటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. ఈమెకు నలుగురు సంతానం ఉన్నారు. ముగ్గురికి వివాహం చేయగా ఒక కుమారుడు మతిస్థిమితంతో అవస్థలు పడుతున్నాడు. కూలీ పనికి వెళ్లి మృతురాలు కుమారుడిని కంటికి రెప్పలా చూసుకుంటుంది. ఇప్పుడు ఆ కుమారుడికి దిక్కెవరని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.


సుబ్బాయమ్మ (పాతచిత్రం)

అంగన్‌వాడీ చిన్నారులకు శుద్ధి జలాలు

రాజమహేంద్రవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్తు శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు స్థానిక గ్రామ పంచాయతీల నుంచి కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేయడంతోపాటు ఆర్వో ప్లాంట్‌కు అనుసంధానం చేయాలన్నారు. కేంద్రాల్లో విద్యుత్తు సరఫరా విషయంలో ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు.

Collector's Office, Kakinada

Ref. Coordn/(Elecs)-1/188/2024. Dt. 15-10-2024

ANNEXURE A-1

ELECTION COMMISSION OF INDIA

Revision of Electoral Rolls for East-West Godavari Graduates' Constituency of Andhra Pradesh Legislative Council

Notice under rule 31(4) of the Registration of Electors Rules, 1960

In pursuance of rule 31(4) of the Registration of Electors Rules, 1960, the Electoral Registration Officer of East-West Godavari Graduates' Constituency vide Public notice Ref.Coordn/(Elecs)-1/188/2024, Dt.30-09-2024, called upon every person entitled to be registered In the electoral roll of the relevant Graduates' Constituency mentioned above, to send to, or deliver at, ERO's Office on or before 06-11-2024 (i.e., the last date of receipt of applications) application In Form-18 appended to the Registration of Electors Rules, 1960 and reproduced In the second schedule of the said notice published in the edition dated 30th September, 2024 of (1) Eenadu and (2) The New Indian Express News Papers.

All the above mentioned persons may submit their applications In Form-18 on or before 06-11-2024 (ie., the last date of receipt of applications), If not already done.

The said details are also available in the official website of the Chief Electoral Officer, Andhra Pradesh at www.ceoandhra.nic.in

Sd/- **Electoral Registration Officer**
East-West Godavari Graduates' Constituency & District Revenue Officer, Kakinada.

రాజమహేంద్రవరం

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లలో)



దేవీచౌక్: టమాట-44, వంకాయలు (నలుపు-34/గులాబీ-46/తెలుపు-34/దొమ్మేరు-48), బెండ-26, కాకర-32, బీర(పందిరి)-36, దొండ-28, క్యారెట్-40, బీట్‌రూట్-36, గోరుచిక్కుళ్లు-32, దోస-32, ఆనబకాయ-36/38, చిక్కుళ్లు-94/దేశవాళీ-104, పచ్చిమిర్చి-48, బంగాళ దుంపలు-34, ఉల్లిపాయలు-50/కొత్తవి-32.

సినిమాలు: దానవాయిపేట: శ్యామల, ఊర్వశి: వేట్టయన్, రాజా: మార్టిన్, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: దేవర, శివజ్యోతి, అశోక: విశ్వం, స్వామి: స్వాగ్, అనుశ్రీ: జనక అయితే గనక, సూర్యమినీ: జిగ్రా, రంభ: మానాన్న సూపర్ హీరో, మేనక: సత్యం సుందరం, మార్టిన్(రెండేసి ఆటలు), వీఎస్ మహల్: వేట్టయన్, దేవర(రెండేసి ఆటలు).

గొడుగుల పంపిణీ

రాజమహేంద్రవరం సాంస్కృతికం: వర్షాకాలం నేపథ్యంలో స్వర్ణాంధ్రా నిర్వాహకుడు గుబ్బల రాంబాబు ఆధ్వర్యంలో పలువురు వృద్ధులకు మంగళవారం గొడుగులు పంపిణీ చేశారు.



ప్రధాన తపాలా కార్యాలయం వద్ద నిరసనలో ఉద్యోగులు

తపాల ఉద్యోగుల ఆందోళన బాట

దేవీచౌక్, న్యూస్‌టుడే: తపాలా శాఖలో వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం చేయనున్నట్లు రాజమహేంద్రవరం తపాలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి బి.కొండబాబు వెల్లడించారు. రాజమహేంద్రవరం ప్రధాన తపాలా కార్యాలయం వద్ద మంగళవారం ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ గ్రూప్-సి యూనియన్ గుర్తింపును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తపాలా శాఖను ప్రైవేటీకరణ దిశగా ప్రోత్సహించే యాక్ట్-2023ను వెనక్కి తీసుకోవాలన్నారు. 8వ వేతన సవరణ కమిటీని వెంటనే నియమించాలని కోరారు. పీ4 యూనియన్ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. జీడీఎస్ యూనియన్ కార్యదర్శి పి.భూలోకం మాట్లాడుతూ జీడీఎస్ ఉద్యోగులకు ఎనిమిది గంటల పనిదినాలు అమలు చేయాలని, డిపార్ట్‌మెంట్ ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం ఉద్యోగ సంఘాల నాయకులు పోస్టల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు యు.జి.ప్రకాష్, ఐ.శ్రీనివాస్, బి.వి.రమణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ రోడ్డు..
రాకపోకలు ఎలా?
తరచూ ట్రాఫిక్ జామ్‌తో ఇక్కట్లు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

ధవళేశ్వరం-కోటిపల్లి బస్టాండ్ ప్రధాన మార్గంలో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వద్ద నిత్యం ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వందల సంఖ్యలో వాహనాలు, ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే మార్గమిది. రహదారి విస్తరణకు నోచుకోకపోవడానికి తోడు కొందరు ఆటో, బస్సు డ్రైవర్ల తీరు కారణంగా స్టేషన్ పశ్చిమ ద్వారం ఎదురుగా ఉన్న ఈ రోడ్డులో ఇరువైపులా తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది.

రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ నుంచి ప్రతిరోజూ 25 వేల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. భీమవరం, నరసాపురం, కాకినాడ, రామచంద్రపురం, రాజోలు, అమలాపురం, రావులపాలెం తదితర ప్రాంతాలకు నడిచే సుమారు వంద ఆర్టీసీ బస్సులతోపాటు అధిక సంఖ్యలో ఆటోలు, ఇతర వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి.



రోడ్డు మధ్యలో ఆపిన బస్సు, వెనుక నిలిచిపోయిన ఇతర వాహనాలు



రోడ్డుపైనే ఇలా ఆటోలు ఆపేసి...

పట్టించుకోని గత ప్రభుత్వం

వైకాపా ప్రభుత్వంలో హయాంలో అప్పటి ప్రజాప్రతినిధులు అదిగో ఇదిగో అంటూ అయిదేళ్ల కాలం గడిపేశారే తప్ప రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోలేదు. పెరిగిన వాహనాల రద్దీతో అసలే ఇరుకుగా మారిన ఈ రోడ్డులో కొందరు బస్సులు, ఆటోలను రహదారి మధ్యలోనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

అధికారులు దృష్టిసారిస్తే..

త్వరలో ఈ రోడ్డు విస్తరణ జరుగుతుందని అధికారులు చెబుతున్నా ఈలోగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. రోడ్డు మధ్యలో కాకుండా ఒకపక్కకు బస్సులు, ఆటోలు నిలిపేలా ట్రాఫిక్ పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. దీంతోపాటు ప్రయాణికులు నిరీక్షించేందుకు వీలుగా ఇక్కడి బస్ షెల్టర్ల నిర్వహణ, సౌకర్యాల మెరుగుపై సంబంధిత అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బస్‌షెల్టర్ల నిర్వహణ లేక..

రోడ్డు పక్కన బస్ షెల్టర్లు ఉన్నా వీటి నిర్వహణ శూన్యం. గుంతలు, బిచ్చగాళ్లతో ఇవి కనిపిస్తాయి. దీంతో బస్సుల కోసం ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడి నిరీక్షించాల్సి వస్తోంది. సగం రోడ్డు ప్రయాణికులతో నిండిపోతుండటంతో బస్సులను కూడా రోడ్డు మధ్యలోనే ఆపి ఎక్కించుకుంటున్నారు. కనీసం ఇక్కడ ట్రాఫిక్ సిబ్బంది కూడా కనిపించడం లేదని పలువురు వాహన చోదకులు, ప్రయాణికులు అంటున్నారు.

17 నుంచి పీజీ ప్రవేశాలు



రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 17 నుంచి 21 తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీపీజీ సెట్-2024 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

కలాం జయంతి వేడుక

కళాశాల భౌతిక శాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం జీవితం విద్యార్థులకు ఆదర్శమని ప్రిన్సిపల్ అన్నారు. భౌతికశాస్త్ర విభాగాధిపతి కోమల లక్ష్మి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతకు సన్మానం

కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకురాలు పి.సురేఖకు ఔట్ స్టాండింగ్ ఎడ్యుకేటర్ అవార్డు లభించింది. యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్స్ అండ్ కల్చర్ ఆర్గనైజేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ థాయిలాండ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5న థాయిలాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, దసరా కల్చరల్ ఫెస్ట్‌లో ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, ఇతర అధ్యాపకులు ఆమెను సత్కరించారు.

– న్యూస్‌టుడే, దేవీచౌక్

ఆదమరిస్తే ముప్పే!



రామచంద్రరావు పేట రెండో వీధి భావనరుషి ఆలయం సమీపంలోని భూగర్భ డ్రెయిన్ ప్రమాదకరంగా మారింది. పూడిక తీత పనుల నిమిత్తం గతంలో ఈ డ్రెయిన్‌పై స్లాబ్ రాళ్లు పక్కకు తొలగించి అలానే వదిలేశారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహన చోదకులు, పాదచారులు రాత్రివేళ దీనిని గమనించకుండా ఏమాత్రం ఆదమరపుగా వెళ్లినా ప్రమాదం బారినపడే అవకాశం ఉందని చెబుతున్నారు. సమస్యను పలుమార్లు సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

ఇలా వదిలేస్తే మురుగు పారేదెలా..



నగరంలోని నారాయణపురం ప్రధాన రోడ్డులో కాలువ ఇది. పాత సిమెంట్ విద్యుత్తు స్తంభాన్ని సంబంధిత సిబ్బంది ఇందులో పడేసి రోజుల తరబడి నిర్లక్ష్యంగా వదిలేయడంతో మురుగు పారని పరిస్థితి. దుర్వాసన వెదజల్లుతుండటంతో నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడితే మురుగు రోడ్డెక్కి రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. పలుమార్లు విద్యుత్తు, నగరపాలక సంస్థ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం



పాడైన ఇనుప బల్లలు

సమస్యల బస్టాప్

కోటిపల్లి బస్టాండ్ ఎదురుగా ఉన్న బస్టాప్‌లో ప్రయాణికుల కోసం వేసిన బల్లలు పాడయ్యాయి. ఇనుపతో వేసినవి కావటంతో కూర్చొనేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ డ్రైనేజీపై వేసిన సిమెంటు పలకలు, ఐరన్ గ్రిల్ సరిగా లేకపోవటంతో వాటిని తన్నుకుని ప్రయాణికులు పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదు..

నగరంలో ప్రయాణికులు పెద్దసంఖ్యలో నిత్యం రాకపోకలు సాగించే ఆర్.టి.సి కాంప్లెక్స్ వద్ద పరిస్థితి ఇది. నిర్మాణంలో ఉన్న కాలువ ఊచలతో ప్రమాదకరంగా ఉంది. బస్సులు కాంప్లెక్స్ లోపలకు వెళ్లే మార్గంలో ఉన్న మలుపు వద్ద ఇనుప ఊచలతో తెరిచి ఉన్న డ్రైనేజీ భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేవు. గతంలో ఇదే ప్రాంతంలో ఓ పాదచారుడు రాత్రి సమయంలో గోతిలో పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పని జరిగేలా చూడాలని, అప్పటి వరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు



కారు అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: రాజమహేంద్రవరం గ్రామీణంలోని బుచ్చియ్యనగర్‌కు చెందిన అబ్బు ముగ్గురు స్నేహితులతో కలిసి ఓ పుట్టినరోజు వేడుక నిమిత్తం సోమవారం అర్ధరాత్రి నగరం నుంచి ఓ కారులో నామవరం బయలుదేరారు. మార్గమధ్యలో మోరంపూడి కూడలి దాటి సాయినగర్ చేరుకునే సరికి కారు అదుపుతప్పి పక్కనే ఉన్న సిమెంటు దిమ్మను, ఓ కాంక్రీట్ యంత్రాన్ని ఢీకొంది. కారులోని ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ముగ్గురు స్నేహితులు స్వల్పగాయాలతో బయటపడగా.. అబ్బు ఛాతీలో తీవ్ర గాయమైంది. అతడు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వర్గాలు బొమ్మూరు పోలీసులకు సమాచారం ఇచ్చాయి.

మరో ప్రమాదంలో..

లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన టి.నాగేశ్వరరావు ద్విచక్ర వాహనంపై మంగళవారం ఉదయం క్వారీ మార్కెట్ రోడ్డులో వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డు విభాగినిని ఢీ కొన్నారు. తీవ్ర గాయాలు కావడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాలు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

లలితానగర్‌కు చెందిన ఎం.లక్ష్మి(62) ఈ నెల 11వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె కుమారుడు సంతోష్ మంగళవారం మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి రివర్ ఫ్రంటుకు మోక్షం

–న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

గోదావరి పుష్కరాల నేపథ్యంలో గోదావరి బండ్ రోడ్డుకు మోక్షం లభించనుంది. రివర్ ఫ్రంటు పేరుతో విస్తరించాలని గతంలో ప్రతిపాదించినా అడుగులు పడలేదు. గత ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తూ అయిదేళ్ల పాటు కాలం గడిపేసింది. పుష్కరాలను పురస్కరించుకుని రివర్ ఫ్రంటు నిర్మాణం చేపట్టాలని కూటమి పాలకులు నిర్ణయించారు. పుష్కరాల ప్రణాళికలో భాగంగా ఎంపీ పురందేశ్వరి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు గత నెలలో గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యటించారు. గత ప్రణాళికలో మార్పులు చేస్తూ రివర్ ఫ్రంటుకు ఆమోదం తెలిపారు. దీంతో ప్రతిపాదనలు పట్టాలెక్కాయి. ఎట్టకేలకు రూ.22 కోట్లతో పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. తొలి విడత రూ.6 కోట్లతో ఘాట్ల విస్తరణకు టెండర్లు ప్రక్రియ పూర్తైంది. త్వరలో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. పుష్కరాల నాటికి పూర్తి స్థాయిలో బండ్ రోడ్డును తీర్చిదిద్దనున్నారు.



గోదావరి బండ్ రోడ్డు విస్తరణ

ప్రణాళికలు మార్చి..

గతంలో కమిషనర్ విజయ్‌రామరాజు హయాంలో సుమారు రూ.40 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆ తర్వాత గత ప్రభుత్వంలో రూ.70 కోట్లతో పనులు చేపట్టాలని భావించినా నిధులు విడుదల కాలేదు. గత ప్రాజెక్టులో గట్టును పొడిగించి, నదిలోకి వెళ్లే అనుభూతి కలిగేలా నిర్మాణాలు చేపట్టాలని భావించారు. అందుకు ఇరిగేషన్ శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రాజెక్టు ఖర్చు భారీగా పెరిగిపోవడంతోపాటు పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని నిర్ధారించారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం విస్తరించాలని నిర్ణయించారు.

అభివృద్ధి ఇలా..

ఘాట్‌ను ఆనుకుని పీవీ నరసింహారావు పార్కు, గౌతమీ నందన వనాన్ని పూర్తి పర్యాటకంగా తీర్చిదిద్దనున్నారు. నదిలో దిగువకు కలిసే విధంగా అభివృద్ధి చేసే రోడ్డు, పార్కులను కలిపి పర్యాటకంగా విస్తరించనున్నారు. మధ్యలో ఆహార శాలలు, చిన్నారులను ఆకట్టుకునేలా వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో త్వరలో పనులు చేపడతామని ఎస్ఈ పాండురంగారావు తెలిపారు. పుష్కరాల నాటికి పనులు పూర్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు.

సైబర్ క్రైమ్‌కు అడ్డుకట్టవేశారు
పోగొట్టుకున్న నగదు తిరిగి అప్పగింత



శ్రీకాంత్‌కు నగదు అందిస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్ల వలలో పడి నగదు పోగొట్టుకున్న బాధితుడికి కేసును ఛేదించి.. తిరిగి ఆ సొమ్మును రాజమహేంద్రవరం సైబర్ సెల్ విభాగం అధికారులు అప్పగించారు. సీఐ జి.ఉమామహేశ్వరరావు వివరాల మేరకు.. నగరంలో మల్లికార్జున నగర్‌కు చెందిన ఎ.శ్రీకాంత్ అనే ప్రైవేటు ఉద్యోగి తన క్రెడిట్ కార్డు పిన్ మర్చిపోయాడు. దీనికోసం గూగుల్‌లోని సంబంధిత బ్యాంకు కస్టమర్ కేర్ నంబరు వెతకగా.. ఓ ఫేక్ నంబరుతో ఆన్‌లైన్ మోసగాళ్లు మాట్లాడారు. నిమిషాల వ్యవధిలోనే బ్యాంకుకు సంబంధించిన ఓ ఫేక్ యాప్ లింక్‌ను శ్రీకాంత్‌కు పంపించి, ఓటీపీ వివరాలు తెలుసుకున్నారు. శ్రీకాంత్ క్రెడిట్ కార్డు నుంచి రూ.55,999 తీసేశారు. అనంతరం యాప్ పని చేయకపోవడం, ఫోన్ నంబర్లు స్పందించకపోవడంతో మోసం జరిగిందని గ్రహించిన అతడు జిల్లా పోలీసు కార్యాలయంలోని సైబర్ సెల్‌ను ఆశ్రయించాడు. స్పందించిన పోలీసులు శ్రీకాంత్ బ్యాంకు లావాదేవీలు బ్లాక్ చేయడంతో నేరగాళ్లు క్రెడిట్ కార్డు ద్వారా కాజేసిన నగదు లావాదేవీ మధ్యలోనే ఆగిపోయింది. ఆ క్రమంలో పది రోజులు అనంతరం మంగళవారం సదరు నగదు వెనక్కి రావడంతో పోలీసులు శ్రీకాంత్‌కు అందజేశారు.

వాంబేవాసుల సమస్యలు పరిష్కరిస్తాం

టి.నగర్, న్యూస్‌టుడే: వాంబే గృహాల్లో నివాసితుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఆదెమ్మదిబ్బ వాంబే గృహాలను మంగళవారం ఆయన పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. లీకవుతున్న శ్లాబ్‌లకు మరమ్మతులను చేపట్టాలని, కాలువల వ్యవస్థను మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాంతాన్ని ఆనుకుని చేపట్టిన సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

అబ్దుల్ కలాంకు నివాళి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: నందం గనిరాజు జంక్షన్‌లోని కలాం విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుక మంగళవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కలాం విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. వైకాపా నాయకురాలు ఎం.షర్మిలారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి, ఆదిత్య డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డి, జి.వి.ఎస్.నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

పరిశోధనలకు అంతర్జాతీయ ప్రోత్సాహం

రాజానగరం: పరిశోధనలు కొనసాగించే వారికి అంతర్జాతీయంగా కూడా ప్రోత్సాహం లభిస్తోందని దక్షిణ కొరియాలోని చుంగ్ఆంగ్ విశ్వవిద్యాలయానికి చెందిన యానిమల్ బయోటెక్నాలజీ, బీఈటీ పరిశోధనా కేంద్రం బ్రెయిన్‌ఫూల్ రీసెర్చ్ ప్రొఫెసర్ డా.జి.గంగరాజు అన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని ఎఫ్ఈడీ విభాగం ఆధ్వర్యంలో బహుళ ఫంక్షనల్ అప్లికేషన్స్‌లో నానోటెక్నాలజీ యొక్క ఇటీవల పురోగతి అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో గంగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నానో టెక్నాలజీ ఇటీవలే ఏఏ రంగాలలో, ఏ విధంగా ఉపయోగిస్తున్నారో వివరంగా తెలిపారు.

కందుకూరి గృహం.. అభివృద్ధితోనే పదిలం
శిథిలావస్థకు చేరిన వీరేశలింగం ఇల్లు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

నగరానికి చెందిన సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం నాడు సాంఘిక దురాచారాలపై ఉక్కుపాదం మోపి మహిళల జీవితాల్లో వెలుగు నింపారు. వంకాయలవారి వీధిలోని కందుకూరి జన్మగృహంలో ఆయన స్మృతులు పదిలంగా ఉన్నాయి. ఆ మహనీయుడు జన్మించిన ఆ గృహం మాత్రం శిథిల స్థితికి చేరింది. దీనికి మరమ్మతులు చేపట్టి భావి తరాలకు పదిలంగా అందించాలని నగరవాసులు కోరుతున్నారు.



భవనంపై పెంకులు ఊడిపోయి..



భవనం లోపల పాడవుతున్న చెక్కలు

ప్రభుత్వం పురావస్తుశాఖ 1998 నుంచి ఈ గృహాన్ని సంరక్షిస్తోంది. ఇక్కడి సంపద తిలకించేందుకు సందర్శకులకు అనుమతి ఇస్తోంది. 19వ శతాబ్దం ప్రారంభంలో కందుకూరి పూర్వీకులు నిర్మించిన ఈ భవనం పూర్తి శిథిల స్థితికి చేరుకుంది. ఎంతో అపురూపమైన సంపద నిక్షిప్తమైన గృహానికి మరమ్మతులు చేయాల్సి ఉంది. కందుకూరి జన్మగృహంతోపాటు ఆయన తన భార్య కోసం నిర్మించిన రాజ్యలక్ష్మి నిలయం శిథిలావస్థలోనే ఉంది.

గృహంలో ఏమున్నాయంటే..

★ కందుకూరి కేవలం సంఘ సంస్కర్త మాత్రమే కాదు. సమాజ హితం కోసం కలం పట్టిన రచయిత. తొలి నవలా రచయిత కూడా వీరేశలింగం కావడం విశేషం. ఆయన రాసిన అనేక రచనలు పుస్తక రూపంలో ఉన్నాయి. బాలలకు సంబంధించిన కథా సాహిత్యం, స్త్రీలకు సంబంధించిన పుస్తకాలు ఇందులో ఉన్నాయి. ఈ సంపదంతా కందుకూరి గృహంలోనే ఉంది.



★ కందుకూరి 1881 డిసెంబరు 11న తొలి వితంతు పునర్వివాహం జరిపించిన నాటి ఘట్టాలతో విగ్రహ రూపంలో ఇక్కడ ఆవిష్కరించారు. కందుకూరి సమాజ చైతన్యం కోసం నడిపిన వివేకవర్ధిని పత్రిక, ఆయన రాసిన నాటకాలు ముద్రించేందుకు వినియోగించిన ముద్రణా యంత్రం ఇక్కడ భద్రపరిచారు.

★ కందుకూరి వినియోగించిన దుస్తులు, రాతప్రతులు, ఆయన నిత్యం కూర్చునే చెక్క కుర్చీలు వంటివి ఈ గృహంలోనే ఉన్నాయి.

మరమ్మతులు చేయాల్సి ఉంది..

భవనాల పైభాగంలో రూపు చెదిరి పెంకులు విరిగిపోవడంతో వర్షం నీరు లోపలకు వస్తోంది. పూర్వకాలం నాటి విద్యుత్తు పరికరాలు కావడంతో అవి పాడయ్యాయి. వాటి స్థానంలో కొత్తగా వైరింగ్ చేయించాలి. గోడలు కూలిపోకుండా బలపరచాలి. రూ.కోటి వరకు ఖర్చవుతుందని అంచనా.

– కె.తిమ్మరాజు, పురావస్తుశాఖ ఏడీ

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లలో)

దేవీచౌక్: టమాట-44, వంకాయలు (నలుపు-34/గులాబీ-46/తెలుపు-34/దొమ్మేరు-48), బెండ-26, కాకర-32, బీర(పందిరి)-36, దొండ-28, క్యారెట్-40, బీట్‌రూట్-36, గోరుచిక్కుళ్లు-32, దోస-32, ఆనబకాయ-36/38, చిక్కుళ్లు-94/దేశవాళీ-104, పచ్చిమిర్చి-48, బంగాళ దుంపలు-34, ఉల్లిపాయలు-50/కొత్తవి-32.

సినిమాలు

దానవాయిపేట: శ్యామల, ఊర్వశి: వేట్టయన్, రాజా: మార్టిన్, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: దేవర, శివజ్యోతి, అశోక: విశ్వం, స్వామి: స్వాగ్, అనుశ్రీ: జనక అయితే గనక, సూర్యమినీ: జిగ్రా, రంభ: మానాన్న సూపర్ హీరో, మేనక: సత్యం సుందరం, మార్టిన్(రెండేసి ఆటలు), వీఎస్ మహల్: వేట్టయన్, దేవర(రెండేసి ఆటలు)

ముగిసిన పుణ్యతిథి ఉత్సవాలు

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ మండలంలోని పలు సాయిబాబా ఆలయాల్లో 106వ పుణ్యతిథి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. బూరుగుపూడి ద్వారకా షిరిడిసాయి బాబా ఆలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా ఆఖరిరోజు మంగళవారం బాబా ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక పెట్రోలు బంకు సమీపంలోని సాయిబాబా ఆలయంలో సహస్ర గులాబీ అర్చన, భజన, అన్నసమారాధన కార్యక్రమాలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హెచ్చరిక వద్దనే చెత్తపోగులు



సమస్య: సీతానగరం మండలం ముగ్గళ్ల సచివాలయం వద్ద చెత్తపోగులు పేరుకుపోయి దుర్వాసనతో అల్లాడుతున్నాం. పేరుకుపోయిన వ్యర్థాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. చెత్త వేస్తే జరిమాన అనే హెచ్చరిక బోర్డు పెట్టి వదిలేశారు. అక్కడే వ్యర్థాలు వేస్తున్నారు. **- స్థానికులు**

సమాధానం: 24 గంటల వ్యవధిలో సమస్యను పరిష్కరిస్తాం.
- భాగ్యలక్ష్మి, కార్యదర్శి

చెరువును తలపిస్తున్న రోడ్డు



సమస్య: స్థానిక క్వారీకెనాల్ రోడ్డులో రాఘవేంద్రస్వామి గుడి ఎదురుగా రహదారిపై నీరు నిలిచిపోతోంది. రోడ్డు ఎత్తుగా ఉండటంతో నెలల తరబడి ముంపులోనే ఈ ప్రాంతం కనిపిస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. **- స్థానికులు**

సమాధానం: క్షేత్రస్థాయిలో సమస్య పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి, ధవళేశ్వరం

– న్యూస్‌టుడే, సీతానగరం, ధవళేశ్వరం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: **91212 29057**, కడియం: **91212 29062**, అనపర్తి: **91000 20947**

నీరు శుభ్రమేనా!


● రక్షిత పథకాలపై అప్రమత్తత అవసరం
● పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు

న్యూస్‌టుడే, సీతానగరం, కొంతమూరు

గ్రామాల్లో ప్రజలకు తాగు, వాడుక అవసరాల కోసం రక్షిత నీరు సరఫరా చేసే పథకాల నిర్వహణ సజావుగా సాగడం లేదు. నిత్యం లక్షలమందికి ఈ పథకాల ద్వారానే నీటి సరఫరా ఉంటుంది. వాటి నిర్వహణ విషయంలో గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. ఇటీవల గోదావరి వరదలు, భారీ వర్షాలు చోటు చేసుకున్న నేపథ్యంలో తాగునీటి పథకాలను పరిశుభ్రంగా ఉంచాల్సి ఉన్నా ఆదిశగా పనులు చేయలేయడం లేదన్న విమర్శలు ఎక్కువయ్యాయి. డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో సుమారుగా 2 వేల చేతిపంపులు ఉంటే జిల్లా అంతటా ఒక్క పంపు మెకానిక్ ఉన్నారు.

మొక్కుబడి తంతు!

గ్రామ పంచాయతీల్లో పథకాల నిర్వహణ మొక్కుబడిగానే సాగుతోంది. ప్రమాణాలకు అనుగుణంగా పనులు జరగడం లేదన్నది స్థానికుల మాట. ట్యాంకుల వద్ద రోజుల తరబడి నీరు నిల్వ ఉండటం, పక్కనే ఉన్న మురుగు కాలువల్లో పూడిక చేపట్టకపోవడంతో ఇబ్బందిగా తయారైంది. వైద్యఆరోగ్యశాఖ సూచనలతో బ్లీచింగ్ కలపకపోవడం, పలుచోట్ల ట్యాంకులు ఎక్కేందుకు మెట్ల మార్గం కూలిపోవడం తదితర సమస్యలు ఎక్కువయ్యాయి.



● చాలాచోట్ల కేవలం నీరు సరఫరా చేస్తున్నామా? లేదా? అన్నదానికే ప్రాధాన్యమిస్తూ పథకాల శుభ్రత గాలికొదిలేశారన్నది క్షేత్రస్థాయిలో వినిపిస్తోన్న మాట. వ్యాధులు సంక్రమించే వర్షాకాలంలోనూ ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజారోగ్యానికి ముప్పు తప్పదు. ముగ్గళ్ల నుంచి కూనవరం వెళ్లే తాగునీరు గొట్టాలు సుమారుగా 7.5 కిలోమీటర్లు దూరం ఉంటే పలుచోట్ల మురుగుకాలువల్లోనే వీటిని వేశారు. రఘుదేవపురంలోనూ అదే పరిస్థితి.

డివిజన్ పరిధిలో...

నియోజకవర్గం	సీపీడబ్ల్యూఎస్	పీడబ్ల్యూఎస్	ఎంపీడబ్ల్యూఎస్	డీపీఎస్	చేతిపంపులు
అనపర్తి	01	83	36	03	203
రాజమహేంద్రవరం గ్రామీణం	01	83	40	02	306
రాజానగరం	03	115	102	05	782
గోకవరం (మండలం)	00	34	30	05	501

నమూనాలు సేకరిస్తున్నాం

రక్షిత మంచినీటి పథకాల వద్ద నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపిస్తున్నాం. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పీఆర్-1 యాప్ ద్వారా సచివాలయం ఇంజినీరింగ్ సహాయకులు ఎప్పటికప్పుడు తాగునీటి పథకాలపై పనులను అప్‌లోడ్ చేస్తున్నారు. నీటిలో క్లోరినేషన్ తదితర వివరాలను పంచాయతీ పథకాల గోడలపై నమోదు చేయాల్సిన బాధ్యత ఆయా పంచాయతీలపైనే ఉంది.
- వి.అవినాష్, ఏఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, రాజానగరం

మండల ప్రజాపరిషత్తు సమావేశం

నేడు

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీడీవో బి.అశోక్ కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

సీతానగరంలో పల్లె పండుగ


సీతానగరం, న్యూస్‌టుడే: పల్లెపండుగ కార్యక్రమం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం సీతానగరంలో పలు గ్రామాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో మద్దిపట్ల భారతి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి చినకొండేపూడి, సీతానగరం, వంగలపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే హాజరవుతారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డా.గంగరాజు

పరిశోధనలకు అంతర్జాతీయ ప్రోత్సాహం

రాజానగరం, న్యూస్‌టుడే: పరిశోధనలు కొనసాగించే వారికి అంతర్జాతీయంగా కూడా ప్రోత్సాహం లభిస్తోందని దక్షిణ కొరియాలోని చుంగ్‌అంగ్ విశ్వవిద్యాలయానికి చెందిన యానిమల్ బయోటెక్నాలజీ, బీఈటీ పరిశోధన కేంద్రం ప్రిన్సిపల్ రీసెర్చ్ ప్రొఫెసర్ డా.జి.గంగరాజు అన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లోని ఎస్‌టీఈ విభాగం ఆధ్వర్యంలో బహుళ ఫంక్షనల్ అప్లికేషన్లలో నానోటెక్నాలజీ యొక్క జీవల పురోగతి అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో గంగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నానో టెక్నాలజీ ఇటీవలే ఏఏ రంగాలలో, ఏ విధంగా ఉపయోగిస్తున్నారో వివరంగా తెలిపారు. వివిధ దేశాలలో ఉన్నత విద్యలో ఎంట్రన్స్‌షిప్ చేసేందుకు ఏ విధంగా సంప్రదించాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీజీయూ ఉపకులపతి డా.యు.చంద్రశేఖర్, డైరెక్టర్ డా.ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డా.పి.ఎం.ఎం.ఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు.



వీరవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

గ్రామాల్లో ప్రగతికి నాంది

కడియం: పల్లెల్లో ప్రగతికి బాటలు వేసేందుకు పల్లె పండుగ నాందిగా మారిందని గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కొనియాడారు. ఆ మేరకు కడియం మండలంలోని పొట్టిలంక, వీరవరం గ్రామాల్లో జరిగిన పల్లె పండుగలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు గ్రామాభివృద్ధిని గాలికొదిలేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గ్రామాల్లో మౌలికవసతుల రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. పొట్టిలంకలో రూ.6 లక్షలతో శ్మశానవాటిక ఆధునికీకరణ పనులు, వీరవరంలో రూ.15లక్షలతో సీసీ రహదారుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. వెలుగుబంటి రామారావు, ముద్రగడ జిమ్మీ, పంతం గణపతి తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువులో 3న వనసమారాధన

దివాన్‌చెరువు (రాజానగరం): దివాన్‌చెరువు వర్తకసంఘం ఆధ్వర్యంలో నవంబరు 3వ తేదీన కార్తీక వనసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశామని వర్తక సంఘం అధ్యక్షుడు బి.వీరభద్రరావు (వీరపండు) తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీరాంపురం వెళ్లే రహదారిలో ఆకుల అమ్మారావు తోటలో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పల్లెలకు ఇది అసలైన పండగ: ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో పల్లెదారులు ప్రయాణికులకు నరకప్రాయంగా తయారయ్యాయని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అభివృద్ధికి శ్రీకారం చుట్టడంతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రంగంపేట మండలం ఎస్.టి.రాజాపురం, వడిశలేరు, రంగంపేట, చండ్రేడు, పెదరాయవరం, ముకుందవరం, ఈలకొలను, అమ్మవారిపురం, వీరంపాలెం, జి.దొంతమూరులలో రూ.3.64కోట్ల అంచనాతో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఆయన శ్రీకారం చుట్టారు. కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యేకు గ్రామాల్లో సత్కారాలు, హారతులు ఇచ్చారు. జిల్లా తెదేపా అధ్యక్షుడు ఆళ్ల గోవిందు, పెదకాయల రాంబాబు, ఎలుబండి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



వడిశలేరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

● అనపర్తి గ్రామీణం: సమర్థతకు, అభివృద్ధి చేసే పార్టీకే పట్టం కట్టాలనే ఆలోచనతో హరియాణాలో భాజపాను మూడోసారి ప్రజలు ఎన్నుకున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. హరియాణా ఎన్నికల్లో భాజపా విజయం సందర్భంగా అనపర్తి దేవీచౌక్ వద్ద భాజపా ఆధ్వర్యంలో జరిగిన విజయోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేకులు కోసి పార్టీ శ్రేణులకు తినిపించారు. కూటమి శ్రేణులు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. శివరామకృష్ణంరాజు, కర్రి బుల్లిరెడ్డి, తమలంపూడి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కలాం చిత్రపటం వద్ద ఎమ్మెల్యే నివాళులర్పించారు.

పూడికలు తీశారు

స్పందనకు వందనం

బొమ్మూరు, న్యూస్‌టుడే: కాతేరు సబ్‌సెంటర్ సమీపంలో పూడికలు రోజుల తరబడి ఉండిపోవడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై 'ఈనాడు'లో 'పూడికలు తొలగించండి' శీర్షికన మంగళవారం ప్రచురితమైన వార్తకు స్పందించిన పారిశుద్ధ్య సిబ్బంది పూడికలు తీసి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు.

ఏపీఎం తీరుతో వీవోలు బేజారు



కడియం మహిళా సమాఖ్య వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న వీవోలు

కడియం, న్యూస్‌టుడే: కడియం మండలం వెలుగు ఏపీఎం అప్పలకొండ తీరుపై డ్వాక్రా వీవోలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మేరకు కడియంలోని మహిళా సమాఖ్యకు పలు గ్రామాల నుంచి వీఓలు తరలివచ్చి నినాదాలు చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. కడియపులంక పొదుపు సంఘాల్లో జరిగిన అవకతవకలకు మండలంలోని అన్ని డ్వాక్రా సంఘాలకు ఆ నేరాన్ని ఆపాదించడం సరికాదని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ వ్యవహారంలో ఆ గ్రామ సర్పంచి రాంజీతో కలిసి ఏపీఎం అప్పలకొండ వ్యవహరిస్తున్న తీరుపై దుయ్యబట్టారు. డ్వాక్రా యానిమేటర్లపై చిన్నచూపు తగదన్నారు. తోటి ఉద్యోగులుగా గుర్తించి గౌరవ మర్యాదలు పాటించాలని ఆమెకు సూచించారు. ఏకవచనంతో సంబోధం, చెప్పుతో కొడతానంటూ బెదిరించడం, శునకంతో పోల్చడం వంటి హీనపు వ్యాఖ్యలు చేయడం తగవని హితవు పలికారు. ఎక్కడో ఏదో జరిగితే ఆ నిందను అందరిపై మోపడం మానుకోవాలన్నారు. విచారణ పేరుతో వీఓలను వేధించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను నిగ్గుతేల్చాలని కోరారు. కార్యక్రమంలో కడియం, మురమండ, కడియపులంక తదితర గ్రామాలకు చెందిన డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ తదితరులు

మహనీయుడు అబ్దుల్ కలాం

నన్నయ విశ్వవిద్యాలయం (రాజానగరం) న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా.ఏ.పి.జె.అబ్దుల్ కలాం జయంతి మంగళవారం వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాల వేసి వీసీ, విశ్వవిద్యాలయ అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశం కోసం, ప్రజల కోసం, విద్యార్థుల కోసం జీవితాంతం శ్రమించిన మహనీయుడు అబ్దుల్ కలాం అని కొనియాడారు. విద్య, విజ్ఞాన, శాస్త్ర, సాంకేతిక రంగాలకు ఎనలేని సేవలందించిన కలాం చిరస్మరణీయులన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.పి.విజయనిర్మల, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బిక్కవోలు: కొంకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాస్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. కలాం దేశానికి చేసిన సేవలను గురించి వివరించారు. పందలపాక జడ్పీ ఉన్నత పాఠశాలలోనూ కార్యక్రమం జరిగింది.



బిక్కవోలు: కొంకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో..

శుభ్రత.. అందరి బాధ్యత

బొమ్మూరు, న్యూస్‌టుడే: వ్యక్తిగత శుభ్రత అందరి బాధ్యతని శాటిలైట్ సిటీలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజరాజేశ్వరి అన్నారు. పాఠశాలలో మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు శుభ్రత, హ్యాండ్‌వాష్, న్యూట్రిషన్ పై మ్యాజిక్ బస్ సిబ్బంది చేస్తున్న కృషిని హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బిక్కవోలు: పందలపాకలో..

బిక్కవోలు: పందలపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ చేతుల పరిశుభ్రతదినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు యువరాజారెడ్డి పాల్గొని భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడగటం వల్ల 50 శాతం వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని సూచించారు.

అభ్యసన వైకల్యాలపై అవగాహన

బిక్కవోలు: బిక్కవోలు ప్రాథమిక పాఠశాలలో పి.సన్యాసిరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వీర్రాజుపేట పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో కొన్ని అభ్యసనా వైకల్యాలకు లోనైన వారిని గుర్తించి వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. హెచ్‌ఎం జొన్నార లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



కనకదుర్గమ్మను దర్శించుకున్న నటులు

కనకదుర్గమ్మ సేవలో పొట్టేలు చిత్ర బృందం

రాజానగరం: పొట్టేలు చిత్రం యూనిట్ రాజానగరంలోని గాంధీ మహాత్ముని విగ్రహం సమీపంలో ఉన్న కనకదుర్గమ్మను మంగళవారం దర్శించుకున్నారు. చిత్రం కథానాయకుడు యువ చంద్రకృష్ణ, కథానాయిక అనన్య నాగేళ్ల, సింగర్ నోయల్, మేనేజర్ వంశీకృష్ణ, డైరెక్టర్ సాహిత్ మోతుకూరి తదితరులు ఉన్నారు. జగ్గంపేట నుంచి రాజమహేంద్రవరం వెళుతూ మార్గమధ్యలో ఉన్న ఈ ఆలయాన్ని సందర్శించారు.

భాజపా సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానం

గోకవరం: భాజపా సభ్యత్వ నమోదులో విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు ఉభయగోదావరి జిల్లాల్లోనే ప్రథమ స్థానంలో నిలిపారని భాజపా జిల్లా కార్యదర్శి మట్టా మంగరాజు తెలిపారు. మంగళవారం కంబాల శ్రీనివాసరావును తంటికొండకు వెళ్లే దారిలో ఉన్న ఆయన కార్యాలయం వద్ద భాజపా నాయకులు సత్కరించారు. సత్తి వెంకటరెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ కోన వెంకట సురేష్, మండల ప్రధాన కార్యదర్శి ఇనకోటి బాపన్నదొర తదితరులు ఉన్నారు.



కంబాల శ్రీనివాసరావును సత్కరిస్తున్న భాజపా నాయకులు

తపాల ఉద్యోగుల నిరసన బాట

దేవీచౌక్: తపాలా శాఖలో వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం చేయనున్నట్లు రాజమహేంద్రవరం తపాలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి బి.కొండబాబు వెల్లడించారు. రాజమహేంద్రవరం ప్రధాన తపాలా కార్యాలయం వద్ద మంగళవారం ఉద్యోగులు నిరసన చేపట్టారు. కొండబాబు మాట్లాడుతూ ఎన్‌ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ గ్రూప్-సి యూనియన్ గుర్తింపును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

కారు అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: రాజమహేంద్రవరం గ్రామీణంలోని బుచ్చియ్యనగర్‌కు చెందిన అబ్బు ముగ్గురు స్నేహితులతో కలసి ఓ పుట్టినరోజు వేడుక నిమిత్తం సోమవారం అర్ధరాత్రి నగరం నుంచి ఓ కారులో నామవరం బయలుదేరారు. మార్గమధ్యలో మోరంపూడి కూడలి దాటి సాయినగర్ చేరుకునే సరికి కారు అదుపుతప్పి పక్కనే ఉన్న సిమెంటు దిమ్మను, ఓ కాంక్రీట్ యంత్రాన్ని ఢీకొంది. కారులోని ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ముగ్గురు స్నేహితులు స్వల్పగాయాలతో బయటపడగా.. అబ్బు ఛాతీలో తీవ్ర గాయమైంది. అతడు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

నేలకొరిగిన వరి

తల్లడిల్లుతున్న అన్నదాతలు

న్యూస్‌టుడే, సీతానగరం



రఘుదేవపురంలో పడిపోయిన వరి పంట

అల్పపీడన ప్రభావంతో ఈదురుగాలుల వర్షం వల్ల సీతానగరం మండలంలో వరి పంటకు తీవ్ర నష్టం కలిగింది. మరో పది రోజుల్లో కోతకు వచ్చిన వరి నేలకొరగడంపై అన్నదాతలు తల్లడిల్లుతున్నారు. మండలంలో ఈ ఏడాది 14 వేల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా ఇప్పటికే భారీ వర్షాల ముంపులో మూడు వేల ఎకరాలు ఊడ్పులు చేయకుండా వదిలేశారు. సుమారుగా 120 రోజుల పంట పూర్తిచేసుకుని.. ఈనెల 25 నుంచి వరి కోతలకు రైతులు సిద్ధమవుతున్నారు. బీపీటీ-5204 సాంబ రకం దాదాపుగా పంటకాలం పూర్తిచేసుకుంది. పీఎల్-1100 వందరోజుల దాటి గింజపోసుకునే దశలో ఉండగా.. తాజా ఈదురుగాలుల ప్రభావంతో నేలవాలింది. రాపాక, రఘుదేవపురం, చినకొండేపూడి, రామచంద్రపురం, నాగంపల్లి తదితర ప్రాంతాల్లో వరి చేలు నేలకొరగడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి వర్షం నిలిచిపోవడంతో కొంతైనా పనికొస్తుందేమోనని రైతులు చేలల్లోకి వెళ్లారు. బీపీటీ-5204 రకం రెండు ఎకరాల్లో వేశానని, మరో పదిరోజుల్లోనే వరికోతకు సిద్ధమవుతుండగా మూడుకుంచాల్లో పంట నేలకొరిగిపోయి పనికిరాకుండా మారిందని రాపాకకు చెందిన రైతు చంద్రు ప్రసాద్ చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. పడిపోయిన పంట సుళ్లు కట్టాలంటే కూలీలకు ఇచ్చే డబ్బులు కూడా గింజలు అమ్మితే రావన్నారు. కాగా మండలంలో 80 శాతం పంట దశ పూర్తిచేసుకుందని కోతలకు సిద్ధమవుతుండగా ఈదురుగాలులకు వరి నేలకొరగడం దిగుబడులపై ప్రభావం చూపుతుందని వ్యవసాయాధికారి కె.సూర్యరమేష్ తెలిపారు. ఇక వర్షం పడకుండా ఉంటే పడిపోయిన చేలు కొంతవరకైనా గింజ దక్కే అవకాశం ఉంటుందన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం

రాజానగరం: దిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా మృతి పట్ల అఖిలభారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యాలయంలో మంగళవారం సంతాపం తెలిపారు. సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పి.వెంకటనాయుడు, జె.సత్తిబాబు తదితరులు హాజరై సమాజం ఒక మేధావిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. మరుకుర్తి వీరలక్ష్మి, తుమ్మల కళావతి, తామర్లగౌరి తదితరులు పాల్గొన్నారు.

● ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయు తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలోనూ నివాళి అర్పించారు. ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వీరాంజనేయులు, కె.అంజిబాబు, జి.నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళులర్పిస్తూ..

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

తొమ్మిది కాసుల బంగారు ఆభరణాలు స్వాధీనం

రాజానగరం: కానవరంలో ఈనెల మూడో తేదీ రాత్రి జరిగిన దొంగతనానికి సంబంధించి నిందితుడు సంగిశెట్టి శివన్నారాయణను అరెస్ట్ చేశామని, అతని వద్ద నుంచి చోరీకి గురైన తొమ్మిది కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎస్.పి.వీరయ్యగౌడ్ తెలిపారు. రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కానవరానికి చెందిన సంగిశెట్టి సీతారామాంజనేయులు తన కుటుంబంతో కలసి గ్రామంలో నిర్వహిస్తున్న కనకదుర్గమ్మ పూజకు వెళ్లి.. రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి చోరీ జరిగినట్లు స్పష్టమైందని.. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించినట్లు సీఐ తెలిపారు. చోరీ చేసిన మొత్తం 14 కాసులను.. నిందితుడు దఫాలుగా విక్రయించాలని నిర్ణయించుకుని తొలుత ఐదు కాసులు అమ్మినట్లు సీఐ తెలిపారు. ఈ క్రమంలోనే తొమ్మిది కాసుల బంగారాన్ని స్వాధీనం చేసుకుని నిందితుణ్ని అరెస్టు చేసినట్లు వివరించారు. ఎస్ఐ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నిందితుడితో సీఐ తదితరులు

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం



విద్యా దీపిక 100వ సంచిక ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు

విజ్ఞానం పెంపునకు కృషి అభినందనీయం

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్యా దీపిక అనే పక్ష పత్రిక నిర్వహిస్తున్నారు. దీని 100వ సంచికను ఎంఈవోలు సక్సేనారాజు, శారదాజ్యోత్స్న మంగళవారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించే విధంగా క్రమం తప్పకుండా పత్రిక నిర్వహిస్తున్నందుకు సంపాదకుడు కృష్ణప్రసాద్‌ను అభినందించారు. రచనలు, పఠనసంపట్ల ఆసక్తి పెంచుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

తాళ్లపూడి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు గజ్జరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ తెలిపారు. ఏలూరు జిల్లాలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఎం.మిల్కీ, జి.శరణ్‌తేజ్ ప్రతిభ చూపడంతో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన జి.విద్యాసాగర్, జె.సందీప్‌ను గ్రామస్థులు అభినందించారు.



విద్యార్థులతో వ్యాయామోపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: మా వీధిలోని ఇళ్లలో వాడుక నీరు సీసీ రోడ్డుపైకి చేరుతోంది. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - స్థానికులు, వాడాలకుంట

సమాధానం: డ్రెయినేజీలను పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. - వెంకయ్య, పంచాయతీ కార్యదర్శి

సమస్య: ఓ మోస్తరు వర్షం కురిసినప్పుడు లేదా ఇతర కారణాలతో నిత్యం నాలుగైదు సార్లు విద్యుత్తు సరఫరా నిలిచిపోతోంది. ఉపకేంద్రానికి ఫోన్ చేసి విషయం అడిగితే చెట్టు కొమ్మలు నరుకుతున్నాం, తీగలు తెగిపోయాయి అని చెబుతున్నారు. గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - బోస్, గోపాలపురం

సమాధానం: రోడ్డు పక్కన ఉన్న చెట్ల కొమ్మలు విద్యుత్తు తీగలపై పడటం, ఈదురు గాలుల కారణంగా అప్పుడప్పుడు మాత్రమే విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఇకపై అలా కాకుండా చర్యలు తీసుకుంటాం. - సీహెచ్.శ్రీనివాసరావు, లైన్‌మేన్

- న్యూస్‌టుడే, గోపాలపురం

సమస్య: ప్రతి నెలా వచ్చే రేషన్‌బండి రాకపోవడంతో సరకులు అందలేదు. ఎదురు చూస్తున్నాం. - రాబంబు, మల్లేశ్వరం

సమాధానం: పరిశీలించి సరకులు ఇచ్చే ఏర్పాటు చేస్తాం. - పావని, ఆర్ఐ

- న్యూస్‌టుడే, పెరవలి



సమస్య: స్థానిక శివాలయం, ప్రాథమిక పాఠశాల వద్ద డ్రెయిన్‌లో వ్యర్థాలు చేరడంతోపాటు గడ్డి పెరగడంతో మురుగు పారుదలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. ఆలయానికి వచ్చే భక్తులు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికుడు, అన్నదేవరపేట

సమాధానం: డ్రెయిన్‌ను పరిశీలించి శుభ్రం చేయిస్తాం. - శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, తాళ్లపూడి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

రైల్వే పైవంతెనపై అరకొర వెలుగులే..!

సమిశ్రగూడెం వైపు దీపాలు వెలగక రాత్రి వేళల్లో అవస్థలు

న్యూస్‌టుడే, నిడదవోలు

★ నిడదవోలు మండలం సమిశ్రగూడేనికి చెందిన వ్యక్తి ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళుతూ రోడ్డు మధ్యలో ఉన్న ఆవు కనిపించకపోవడంతో దానిని ఢీకొని గాయాల పాలయ్యారు.

★ సమిశ్రగూడేనికి చెందిన వ్యక్తి కుమార్తెను రైలు ఎక్కించేందుకు ద్విచక్ర వాహనంపై రాత్రి సమయంలో బయలుదేరారు. ఆర్వోబీపైకి చేరుకునే సరికి అక్కడ అప్పటికే నిలిచి ఉన్న వాహనం కనిపించక దానిని ఢీకొన్నారు.

..ఇవి కొన్ని సంఘటనలు మాత్రమే. నిడదవోలు రైల్వే పైవంతెన(ఆర్వోబీ)పై ఇటువంటివి నిత్యకృత్యంగా మారాయి. కారణం కొంత కాలంగా ఆర్వోబీపై దీపాలు సగం మాత్రమే వెలుగుతూ, మిగిలినవి వెలగకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారం అలుముకుంటుండడమే. దీనివల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల పరిధిలోని ప్రజలు రాకపోకలు సాగించడానికి నిడదవోలు ఆర్వోబీ ఎంతో ప్రధానమైంది. దీని మీదుగా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రధానమైన ఆర్వోబీపై కొన్ని రోజులుగా సమిశ్రగూడెం వైపు వరుసగా ఉన్న 9 వీధి దీపాలు వెలగక ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. వీటితో పాటు మరో ఆరు దీపాలు వరకు మొత్తం 15 వెలగడం లేదు. నిడదవోలు వైపు ఉన్న దీపాలు మాత్రమే వెలుగుతున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్వోబీ నిర్మాణం జరిగిన తర్వాత పట్టణంలో ట్రాఫిక్ సమస్య కొంత తీరినా చాలా ఏళ్ల పాటు దీపాలు ఏర్పాటు చేయలేదు. తెదేపా ప్రభుత్వ హయాంలో 32 వరకు వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మరమ్మతులకు గురై సగం వెలగడం లేదు. ఆర్వోబీ సగ భాగం నిడదవోలు పట్టణ పరిధిలో ఉండగా, మిగిలిన భాగం సమిశ్రగూడెం పంచాయతీ పరిధిలో ఉంది. అయితే వీధిదీపాల నిర్వహణతోపాటు, వెల్లావెదారన్ని తొలగించడం వంటి నిర్వహణ పనులను పురపాలక సంఘ అధికారులే చేపడుతున్నారు.



నిడదవోలు వైపు వెలుగులు..

దీపాలు ఏర్పాటు చేసిందొకరు..

ఆర్వోబీపై చాలా కాలం దీపాలు లేకపోవడంతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ర.భ.శాఖ అధికారులు 8 ఏళ్ల కిందట దీపాలు ఏర్పాటు చేశారు. అనంతరం వాటి నిర్వహణ బాధ్యతను పురపాలక అధికారులకు అప్పగించారు. ఈ దీపాలు కొంతకాలం బాగానే వెలిగినా అనంతరం తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. చీకట్లో నడిచి వెళ్తున్న పాదచారులు కనిపించక వాహనాలు ఢీకొని గాయాలపాలవుతున్నారు. పైగా ఫుట్‌పాత్ అనేక చోట్ల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో చీకట్లో గుంతలు కనిపించక వాటిలోపడి గాయాల పాలవుతున్నారు. నిడదవోలుకు సమిశ్రగూడెం చేర్చి ఉండటంతో అనేక మంది మహిళలు నిత్యం నడిచి వివిధ పనులపై నిడదవోలు వస్తుంటారు. రాత్రి సమయంలో తిరిగి ఇంటికి బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తుంది.



ఆర్వోబీపై సమిశ్రగూడెం వైపు అంధకారం

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

ఆర్వోబీపై ఉన్న దీపాలను పరిశీలించి మరమ్మతులు చేపడతాం. ఆర్వోబీ సగం మేర నిడదవోలు, సగం మేర సమిశ్రగూడెం పరిధిలోకి వస్తుంది. దీని దృష్ట్యా సమిశ్రగూడెం వైపు ఉన్న దీపాల నిర్వహణ ఎవరు చేపట్టాలనేది కూడా పరిశీలిస్తాం.

- హేమంత్, ఏఈ, నిడదవోలు పురపాలక సంఘం

పుస్తకావిష్కరణ

తాళ్లపూడి: మండలంలోని పైడిమెట్టలో పీవీ రామ్ రూపొందించిన మాదిగ వారి ఇంటిపేర్లు అనే పుస్తకాన్ని మాజీ వీసీ జార్జ్ విక్టర్, విశ్రాంత జిల్లా జడ్జి గంగాధరుడు మంగళవారం ఆవిష్కరించారు. నియోజకవర్గ నాయకులు జయరాజు, మధు, రత్నప్రకాష్, జల మయ్య పాల్గొన్నారు.

నారీమణులకు సన్మానం

దేవరపల్లి: దేవరపల్లి పంచాయతీ పరిధిలోని సచివాలయంలో గ్రామీణ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నారీమణులకు సన్మానం నిర్వహించారు. మంగళవారం పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచి కడిమి వీరకుమారి, వార్డు సభ్యులు గద్దే రమాదేవి, చల్ల లక్ష్మి, సచివాలయం సిబ్బంది భార్గవిరేఖ, దివ్య, సుమ, రమ్యలను ప్రత్యేకంగా సత్కరించారు. కార్యదర్శి రవి కిషోర్, ఉప సర్పంచి వెలగ సాంబశివరాజు, కైరం అప్పారావు, కె.రాజు పాల్గొన్నారు.

‘తెదేపా, భాజపాలకు ప్రాధాన్యం’

నిడదవోలు, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఉమ్మడి కూటమి పొత్తుకు పెద్ద పీట వేశారని జనసేన నిడదవోలు పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్ అన్నారు. ఈనెల 14న నిడదవోలు మండలం కంసాలిపాలెంలో జరిగిన సంఘటనపై మంగళవారం పట్టణ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పొత్తు ధర్మం పాటించాలని మొదటి నుంచి చెబుతున్న వ్యక్తి మంత్రి దుర్గేష్ అన్నారు. ముందుగా తెదేపా, భాజపాలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం, నాయకులు ఎం.డి.అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి పెద్దపీట

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పల్లె ప్రగతికి పెద్ద పీట వేస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా వేలివెన్నులో రూ.39 లక్షలతో చేపట్టనున్న 5 అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సర్పంచి అత్తిలి సత్యనారాయణ, ఉప సర్పంచి బూరుగుపల్లి శ్రీనివాసు, ఎంపీడీవో వి.రామారావు, తహసీల్దార్ వి.ప్రసాద్ పాల్గొన్నారు.



గోపవరంలో పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు: మండలంలోని విజ్జేశ్వరం, గోపవరం, కలవచర్ల, జీడిగుంట, కోరుపల్లి, పెండ్యాల, మునిపల్లి, వేలివెన్ను, శెట్టిపేట, తాళ్లపాలెం గ్రామాల్లో మంగళవారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమాల్లో మంత్రి దుర్గేష్ పాల్గొని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గోపవరంలో రూ.25.24 లక్షల వ్యయంతో నిర్మించిన మండల పరిషత్ పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా.. పాత బోర్డులే..

కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం పాత పాలనలో నడుస్తోంది. ఎమ్మెల్యే మారినా, మార్కెట్ కమిటీ రద్దయినా పాత పాలక మండలి పేర్లున్న బోర్డే ఇంకా కార్యాలయంలో ప్రదర్శిస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువై నాలుగు నెలలు దాటుతున్నా.. ఆ సమాచారం తెలిపే బోర్డులు మార్చకపోవడం గమనార్హం. మార్కెట్ యార్డు పరిశీలనకు ఎమ్మెల్యేతోపాటు గురువారం కార్యాలయానికి వెళ్లిన వారంతా ఆ బోర్డు చూసి మరీ ఇంత నిర్లక్ష్యమా అంటూ విమర్శిస్తున్నారు.



- న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం, చాగల్లు

గ్రామాల అభివృద్ధే కూటమి ధ్యేయం

నల్లజర్ల, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. మంగళవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అచ్చన్నపాలెం, ఘంటావారిగూడెం, దూబచర్ల, అయ్యవరం, ముసుళ్లగుంట, పుల్లలపాడులో రూ.1.20 లక్షలతో చేయబోయే వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో సరైన మౌలిక వసతులు లేక ప్రజలు ఇక్కట్లు పడ్డారన్నారు. ముసుళ్లగుంట గ్రామ ప్రజలు తమ సమస్యను ఎమ్మెల్యేకు విన్నవించారు. పుల్లలపాడు జాతీయ రహదారి వద్ద సర్వీస్ రోడ్డు లేకపోవడంతో ఇప్పటి వరకు 13 మంది వరకు మృత్యువాతపడ్డారని, మోటార్ బోర్ల నుంచి విద్యుత్తు తీగలు దొంగలిస్తున్నారని తెలియచేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, షేక్ మీరా సాహెబ్, వల్లూరి సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.



అయ్యవరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు

గోష్పద క్షేత్రంలో పరిశుభ్రత పాటించాలి

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: దక్షిణ భారత దేశంలో చిన కాశీగా పేరొందిన కొవ్వూరు గోష్పద క్షేత్రం ఆధ్యాత్మికతకు ఆలవాలమని, అటువంటి పుణ్య ప్రదేశంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన గోష్పద క్షేత్ర దేవాలయాల నిర్వాహకులు, స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. క్షేత్రంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్తిక మాసం దృష్ట్యా క్షేత్రంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి, వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పండితులు, స్థానికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగేంద్రకుమార్

వైభవంగా గ్రామోత్సవం

పెరవలి : ఖండవల్లిలోని కార్చెర్ల వారి వీధిలో కనకదుర్గమ్మకు మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా పేలుళ్లతో వైభవంగా గ్రామోత్సవం సాగింది.

ఉండ్రాజవరం : మండలంలోని వడ్లూరు, ఉండ్రాజవరం, వేలివెన్ను, కాల్దరి తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గాదేవిని అలంకరించిన వాహనాల్లో వాయిద్యాల నడుమ ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడులు


గోపాలపురం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు సూచించారు. మండలంలోని కరగపాడు, కొవ్వూరుపాడు పంచాయతీ పరిధిలో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖాధికారులు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పంట బోదెలకు మహర్దశ

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పంట బోదెల్లో పూడికతీత పనులు చేపట్టడం వల్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఎంపీడీవో వి.రామారావు అన్నారు. మండలంలోని వేలివెన్ను, తాడిపర్రు, చిలకపాడు, సత్యవాడ గ్రామాల్లో ఉపాధి పనుల ఎంపిక, మంజూరుపై మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా సభల్లో రైతులు వినతుల మేరకు పలు పనులను ఆమోదించారు. సర్పంచులు కరుటూరి నరేంద్రబాబు, అత్తిలి సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అపాయమే

దేవరపల్లి మండలం దుద్దుకూరు రహదారిలోని పెట్రోల్ బంకు నుంచి బంధపురం వెళ్లే రోడ్డులో విద్యుత్తు స్తంభం పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. ప్రధాన రహదారిని ఆనుకుని విద్యుత్తు స్తంభం ఉండడంతో ఈదురు గాలులు వీస్తే రైతులు, ప్రయాణికులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని సరి చెయ్యాలని రైతులు కోరుతున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ సీహెచ్.వెంకట్రావును వివరణ కోరగా సమస్య పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.



- న్యూస్‌టుడే, దేవరపల్లి

అధ్వానం.. ప్రయాణం అవస్థలమయం



ఇటీవల కురిసిన వర్షాలకు ప్రక్కిలంక నుంచి గోపాలపురం వెళ్లే రెండు వరుసల ర.భ.శాఖ రహదారి అధ్వానంగా తయారైంది. పైడిమెట్ట, గజ్జరం వద్ద పెద్ద గుంతలు పడడంతో రాకపోకల సమయంలో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వేసిన ఈ రహదారి నాణ్యత లేకపోవడంతో గుంతలమయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో రెండుసార్లు నామమాత్రంగా మరమ్మతులు చేశారు. తిరిగి అదే చోట గుంతలు పడ్డాయి. రోడ్డు దుస్థితిని ర.భ.శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి మరమ్మతులు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, తాళ్లపూడి

నేల వాలుతున్న వరిచేలు

తాళ్లపూడి, న్యూస్‌టుడే : అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజుల నుంచి ఈదురుగాలులు, వర్షం కారణంగా మండలంలో కోతకు వచ్చిన స్వర్ణ, సంపతిస్వర్ణ, గోల్డ్ స్వర్ణ వరి రకాలు నేలకొరుగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేగేశ్వరపురం, కుకునూరు, పెద్దేవం తదితర గ్రామాల్లో మరో వారం రోజుల్లో కోతకు వచ్చే చేలకు నష్టం వాటిల్లుతోంది. చేలు ఇలా నేలకొరిగితే మసూళ్ల సమయంలో అధిక వ్యయం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాళ్లపూడిలో వరిచేను పరిస్థితి

తుపాను సమయంలో కోతలు వద్దు..

నల్లజర్ల, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున రైతులు వరి పంటలు కోయరాదని మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ సూచించారు. మంగళవారం నల్లజర్ల, మారెళ్లమూడి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యానశాఖాధికారిణి బబిత, ఏఈవో పుష్పలత పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి అబ్దుల్ కలాం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆదర్శమూర్తి అని పలువురు కొనియాడారు. కలాం జయంతి సందర్భంగా దమ్మెన్ను తదితర గ్రామాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సర్పంచి గురజర్ల సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

చాగల్లు, కొవ్వూరు పట్టణం: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆలోచనలు యువతకు ఆదర్శప్రాయమని ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాల ఉన్నత భారత్ అభియాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎల్లాప్రగడ రమేష్ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.సత్యనారాయణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.సూరిబాబు, అధ్యాపకుడు పి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి : మండలంలోని రాగోలపల్లి ప్రాథమిక, తాళ్లపూడిలోని విజేత పాఠశాలల్లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి నిర్వహించి, ఆయన చిత్రపటాలకు విద్యార్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శాస్త్రసాంకేతిక రంగంలో ఆయన చేసిన కృషిని ప్రధానోపాధ్యాయుడు దుర్గారావు విద్యార్థులకు వివరించారు. ఆయనన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు

గోపాలపురం : పేపర్ బాయ్ నుంచి రాష్ట్రపతి వరకు ఏపీజే అబ్దుల్ కలాం జీవన ప్రస్థానం అందరికీ స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయుడు పోసియ్య పేర్కొన్నారు. భారతరత్న కలాం జయంతిని మండలంలోని ఆయా పాఠశాలల్లో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కొవ్వూరులో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పొంచి ఉన్న ప్రమాదం



ప్రకాశరావుపాలెం నుంచి నల్లజర్లకు వెళ్లే బీటీ రహదారి గుంతలు ఏర్పడడం వల్ల వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నల్లవంతెన వద్ద, పోలవరం కుడి కాలువ వంతెనపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల తాడేపల్లిగూడెం నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న దంపతులు కుడి కాలువ వంతెన గుంతలో పడి తీవ్ర గాయాల పాలయ్యారు. దీనిపై ఇరిగేషన్ అధికారిని వివరణ కోరగా సత్వరమే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, నల్లజర్ల

సంక్షేమానికి చిరునామా కూటమి పాలన

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి పాలన అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా అని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఆయన మంగళవారం కూటమి నాయకులతో కలిసి దొమ్మేరులో రూ.6 లక్షలు, నందమూరులో రూ.12 లక్షలు, పశివేదలలో రూ.23 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ నిధులు అక్కడి పనులకే వెచ్చించడం ద్వారా గ్రామాలభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. వైకాపా విధ్వంస పాలన అనంతరం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంతో పల్లెలు అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



దొమ్మేరులో శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే ముప్పిడి తదితరులు

తాళ్లపూడి : కేంద్ర ప్రభుత్వ నిధులతో పల్లెలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా అన్నదేవరపేట, తాళ్లపూడి, వేగేశ్వరపురంలో మంగళవారం సాయంత్రం రూ.73 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. గత వైకాపా పాలనలో పంచాయతీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ హయాంలో రహదారులు, తాగునీరు, డ్రెయిన్లు, వీధిదీపాలు తదితర సౌకర్యాలతో పల్లెలను దశలుగా వారీగా అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో కేంద్రప్రభుత్వ నిధులతో పంచాయతీలను బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తెదేపా యువగళం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.